

అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

25.11.2026
బుధవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 146
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.

మళ్లీ చేతులు కలిపిన బీజేపీ, అకాలీదళ్!

- పంజాబ్ రాజకీయాల్లో కీలక పరిణామం
- అకాలీదళ్ కూటమిలో పెద్దన్న పాత్ర
- ముఖ్యమంత్రి అభ్యర్థి కూడా ఆ పార్టీకే

2లో..



చండీగఢ్, నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్

పంజాబ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. భారతీయ జనతా పార్టీ , శిరోమణి అకాలీదళ్ మరోసారి పొత్తు పెట్టుకున్నాయి. ఈ కూటమిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. అకాలీదళ్ కూటమిలో పెద్దన్న పాత్ర పోషిస్తుందని, ముఖ్యమంత్రి అభ్యర్థి కూడా ఆ పార్టీకే చెందిన వ్యక్తి ఉంటారని స్పష్టం చేశారు.

10 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చాం

- పాలమూరులో పంటలు ఎండిపోయాయి
- రేవంత్ రెడ్డి గురుదక్షిణ వల్లే
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్
- 4 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి
- పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి
- నువ్వు కనీసం లక్ష ఎకరాలకైనా ఇచ్చినవా

2లో..



పురుషులు పందుల్లా వారిని చూస్తున్నారు

- వధువు వేశ్యలా అలంకరించుకుని కూర్చుంటే
- మహిళలు పరదా వేసుకోవడం లేదు
- ఏఐఎంఐఎం బిహార్ అధ్యక్షుడు కామెంట్



2లో..

డిసెంబర్ 16న స్వదేశానికి..

- బంగ్లాదేశ్ తిరిగి వెళ్లనున్న షేక్ హసీనా
- ఢాకా వెళ్లే యోచనలో ఉన్నట్లు..
- బిమాన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్‌లో ఏర్పాట్లు

ఢాకా, నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వెళ్లే విషయమై కీలక ప్రకటన చేశారు. డిసెంబర్ 16న తాను బంగ్లాదేశ్‌కు వెళ్లే యోచనలో ఉన్నట్లు ప్రకటించారు. బంగ్లాదేశ్‌లో జరిగిన తిరుగుబాటు కారణంగా ప్రధాని పదవిని కోల్పోయిన హసీనా ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. అయితే స్వదేశం తిరిగి వెళ్లేందుకు నిర్దిష్టమైన తేదీని ఆమె వెల్లడించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

2లో..

మూసీ పనుల్లో వేగం పెంచండి

- గడువులోగా పూర్తి చేయండి: సీఎం రేవంత్‌రెడ్డి
- మూసీ పనుల్లో వేగం పెంచాలని ఆదేశం
- జనవరి 2027లో ఫేజ్-1 ప్రారంభం
- టెండర్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి
- 2028 జనవరికి మిరాలం పనులు పూర్తి
- చెరువులో పూడిక తొలగించాలని ఆదేశం
- రేడియల్ రోడ్ల నిర్మాణం వేగవంతం
- పీఆర్‌టీఎస్ అలైన్‌మెంట్లపై సమీక్ష
- గోశాల, ఫ్రూట్ మార్కెట్‌కు డెడ్‌లైన్లు



హైదరాబాద్, నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్
మహానగర అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల పరిధిలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్లు, మిరాలం చెరువు అభివృద్ధి, ఆధునిక గోశాల, PRTS వంటి కీలక ప్రాజెక్టుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

జనవరి 2027లో మూసీ పనులు ప్రారంభం
మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు ఫేజ్ 1 పనులను 2027 జనవరిలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.20 కిలోమీటర్ల ప్రాంతాన్ని జోన్ 1ఏగా, ఉస్మాన్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్ల ప్రాంతాన్ని జోన్ 1బీగా విభజించి పనులు చేపట్టనున్నారు. పనుల విషయంలో వేగం పెంచి నిర్ణీత సమయంలో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని సీఎం సూచించారు.

మిరాలం చెరువుకు కొత్త రూపు
మిరాలం ట్యాంక్ అభివృద్ధి పనులపై కూడా సీఎం ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఈ ప్రాజెక్టును 2028 జనవరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. చెరువు అభివృద్ధితో పాటు ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన పూడికను తొలగించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణం, భూసేకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు.

హైదరాబాద్‌లో ప్రణాళికలు సిద్ధం!
నగరంలో పర్సనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఫేజ్ 1కు సంబంధించిన టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. కూకట్‌పల్లి నుంచి రాయదుర్గ్ మీదుగా బయోడైవర్సిటీ వరకు ఒక అలైన్‌మెంట్‌ను, బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి సచివాలయం, బషీర్‌బాగ్ మీదుగా రాణిగంజ్ వరకు మరో అలైన్‌మెంట్‌ను ప్రతిపాదించారు. నెక్లెస్‌రోడ్, రాయదుర్గ్, పీపుల్స్ ప్లాజా ప్రాంతాల్లో డిపోల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించి సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. డిపోల వద్ద మల్టీ లెవల్ పార్కింగ్ సదుపాయాలు కల్పించేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

2లో..

సైనికుల మొబైల్ ఫోన్లలో 87 యాప్‌లు నిషేధం

- భారత సైన్యం కీలక నిర్ణయం
- దేశ భద్రతకు భారత సైన్యం ప్రాధాన్యం
- యాప్‌ల విషయంలో కలిన నిబంధనలు

2లో..



ఏపీ, తెలంగాణ మధ్య వివాదాలు వద్దు

- కొవ్వూరులో కవిత వ్యాఖ్యలు
- రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ
- రాష్ట్రాలు స్నేహపూర్వక వాతావరణం ఉండాలి
- నీటి వివాదాలు తలెత్తడం విచారకరం
- రేవంత్ రెడ్డి ఒంటెత్తు పోకడతో వ్యవహరిస్తున్నారు

2లో..



అమరావతి, నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్

తూర్పుగోదావరి జిల్లా జిల్లాలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు.. రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు స్నేహపూర్వక వాతావరణంలో ఉండాలని ఆకాంక్షించారు.

భోగాపురం హైవేపై విషాదం

- ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు
- ఐదుగురి దుర్మరణం!
- శ్రీముఖలింగం దర్శనం చేసుకుని వస్తుండగా


5లో..

భోగాపురం, నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్
దైవదర్శనం చేసుకుని ఎంతో సంతోషంగా ఇంటికి తిరిగి వస్తున్న కుటుంబాల ప్రయాణం విషాదాంతమైంది. విజయనగరం జిల్లా భోగాపురం మండలం సుందరపేట సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఆగి ఉన్న భారీ ట్యాంకర్‌ను వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఈ పెను ప్రమాదం సంభవించింది.

సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలు

- గ్రామపంచాయతీ ఎన్నికలు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా
- ఎన్నికలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశాం
- మూడు దశల గ్రామపంచాయతీ ఎన్నికలు
- 19శాతం వరకూ ఏకగ్రీవాలు జరిగాయి
- బలవంతంగా ఏకగ్రీవాలు జరగకూడదని స్పష్టం
- పోలీసు బలగాలు అదనంగా విధుల్లో ఉంటాయి

5లో..




అమరావతి, నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్

గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. మూడు దశల గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం విజయవాడలో కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులతో ఎస్ఈసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులతో పలు కీలక అంశాలపై చర్చించారు.

కలెక్టర్లు, ఎస్పీల వరకు అందరికీ వీగల్ నోటీసులు!

- స్థానిక ఎన్నికల వేళ వైసీపీ బిగ్ వార్నింగ్
- ఎన్నికల నిర్వహణపై వైసీపీ న్యాయపోరాటం
- సుప్రీంకోర్టు ఆదేశాలను క్షేత్రస్థాయిలో
- కచ్చితంగా అమలు చేయాల్సిందే

5లో..



తిరుమల శ్రీవారి భక్తులకు బీమా సొమ్ము అందజేత

దేశంలోనే తొలిసారిగా...

తిరుమల, నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్

శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సంక్షేమానికి తితిదే విశేషంగా కృషి చేస్తోంది. ఇప్పటివరకు ప్రమాదాలకు మాత్రమే పరిమితమైన బీమా సౌకర్యాన్ని విస్తరించి, తొలిసారిగా సహజ మరణాలకు కూడా వర్తించేలా చర్యలు చేపట్టింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా తిరుమలలో సహజ మరణానికి రూ.2 లక్షల బీమా ప్రయోజనం అందించే పథకాన్ని తితిదే తొలిసారిగా అమల్లోకి తెచ్చింది. శ్రీవారి భక్తులకు 'శ్రీవారి యాత్ర సురక్ష' పథకం ద్వారా దేశంలోనే తొలిసారిగా భరోసా కల్పిస్తున్నట్లు తితిదే సాధికారిక మండలి ఛైర్మన్, ఈవో ముద్దాడ రవిచంద్ర తెలిపారు.

2లో..



సైనికుల మొబైల్ ఫోన్లలో

87 యాప్‌లు నిషేధం

న్యూఢిల్లీ, నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్

దేశ భద్రతకు భారత సైన్యం అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. దేశ రక్షణకు అవసరమైన అన్ని రకాల చర్యలను ఎప్పటికప్పుడు చేపడుతుంది. ఇందులో భాగంగా తాజాగా సైనికులు తమ మొబైల్ ఫోన్లలో వినియోగించే యాప్‌ల విషయంలో కఠిన నిబంధనలు విధించింది. ఫేస్‌బుక్, స్నాప్‌చాట్, హింజ్, పబ్‌జీ వంటి ప్రముఖ యాప్‌లతో పాటు పలు సోషల్ మీడియా, డేటింగ్, గేమింగ్ యాప్‌ల వినియోగంపై ఆంక్షలు విధించింది. మొత్తం 87 రకాల మొబైల్ అప్లికేషన్లను ఉపయోగించకూడదని సైనికులు, అధికారులు సహా సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది.

ఈ యాప్‌ల ద్వారా దేశ విద్రోహశక్తులు సైనికులను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని భారత సైన్యం భావిస్తోంది. వారి వ్యక్తిగత సమాచారం, లొకేషన్ వివరాలు, విధులకు సంబంధించిన కీలక వివరాలను సేకరించి ప్రమాదం ఉందని అనుమానిస్తోంది. అలాగే, ఆ సమాచారాన్ని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. సైనికులు నెట్టింట షేర్ చేసే ఫొటోలు, వీడియోలు, వ్యక్తిగత వివరాలు దేశ భద్రతకు ముప్పుగా మారే అవకాశం ఉందని భావిస్తోంది. ఈ సమాచారాన్ని శత్రు దేశాల నిఘా సంస్థలు తమకు అనుకూలంగా ఉపయోగించుకునే ప్రమాదం ఉన్నందున భారత సైన్యం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అలాగే, సైనికులు హనీట్రాప్, సైబర్ దాడుల బారిన పడకుండా ఈ చర్యలు చేపట్టింది.

కాగా, సోషల్ మీడియా వినియోగానికి సంబంధించి భారత సైన్యం ఎప్పటికప్పుడు మార్గదర్శకాలను సవరిస్తూ వస్తోంది. గతంలోనూ కొన్ని సోషల్ మీడియా వేదికల్లో సమాచారాన్ని వీక్షించేందుకు మాత్రమే అనుమతించింది. అక్కడ పోస్టులు పెట్టడం, కామెంట్లు చేయడం, సందేశాలు పంపడం వంటి కార్యకలాపాలపై పరిమితులు విధించింది. సైనికుల వ్యక్తిగత ఆన్‌లైన్ కార్యకలాపాల కంటే దేశ భద్రతకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఈ నిబంధనలను అమలు చేస్తోంది. కాగా, ఈ ఆంక్షల జాబితాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, పబ్‌జీ, క్లాష్ ఆఫ్ కింగ్స్ వంటి గేమింగ్ యాప్‌లు ఉన్నాయి. అలాగే టిండర్, హింజ్, బంబుల్ వంటి డేటింగ్ యాప్‌లతో పాటు వీచాట్, షేర్‌ఇట్, యూసీ బ్రౌజర్, ట్రూకాలర్, జూమ్, డైలీహంట్ వంటి యాప్‌లూ ఉన్నాయి.

మళ్లీ చేతులు కలిపిన బీజేపీ, అకాలీదళ్!

(మొదటి పేజీ తరువాయి)

2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ, శిరోమణి అకాలీదళ్ మరోసారి జతకట్టాయి. ఈ కూటమి ప్రకటన సందర్భంగా అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్‌తో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఎన్‌డీఏలో అత్యంత పాత మిత్రపక్షమైన అకాలీదళ్ తిరిగి కూటమిలోకి వస్తోందని అమిత్ షా ప్రకటించారు. దాదాపు మూడు నెలల చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. 2027 ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేయనున్నాయని తెలిపారు.

కూటమిలో అకాలీదళ్ పెద్దన్న పాత్ర పోషిస్తుందని అమిత్ షా స్పష్టం చేశారు. పెద్దన్న పాత్రలో ఉండే పార్టీకే ముఖ్యమంత్రి పదవి దక్కుతుందని ప్రకటించారు. అయితే ఏ పార్టీకి ఎన్ని అసెంబ్లీ స్థానాలు కేటాయించాలనే అంశంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. పంజాబ్‌లోని మొత్తం 117 అసెంబ్లీ స్థానాల్లోనూ ఎన్‌డీఏ కలిసి పోటీ చేస్తుందని అమిత్ షా వెల్లడించారు. సీట్ల పంపకాలపై రాబోయే రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ తెలిపారు.



పంజాబ్‌లో డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలించడం తమ ప్రధాన లక్ష్యమని అమిత్ షా ప్రకటించారు. 2029 డిసెంబర్ 31 నాటికి పంజాబ్‌ను పూర్తిగా నశాముక్త్ రాష్ట్రంగా మారుస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ పార్టీలు కూడా డ్రగ్స్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చాయని, కానీ ఆ లక్ష్యాన్ని సాధించలేకపోయాయని విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి, గ్యాంగ్‌స్టర్ సంస్కృతి, నేరాలను అరికట్టడం కూడా కూటమి ప్రాధాన్యతలుగా పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన అమిత్ షా.. బీజేపీ, అకాలీదళ్ కలిసి రావడంతో ఆ పార్టీ ఓటమి ఖాయమని వ్యాఖ్యానించారు. సిక్కు సమాజాన్ని అవమానించిన వారిని ప్రజలు అధికారంలో నుంచి దించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

బీజేపీతో మళ్లీ పొత్తు కుదరడంపై అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ హర్షం వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ ఒప్పందం కాదని, పంజాబ్ ప్రయోజనాల కోసం ఏర్పడిన భావోద్వేగ బంధమని అభివర్ణించారు. పంజాబ్ ప్రజలు కూడా ఈ రెండు పార్టీల మధ్య పొత్తు మళ్లీ కుదరాలని కోరుకున్నారని అన్నారు. అకాలీదళ్‌కు 106 ఏళ్ల ఘనమైన చరిత్ర ఉందని, దేశ స్వాతంత్ర్య పోరాటం నుంచి పంజాబ్ అభివృద్ధి వరకు ఆ పార్టీ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.

గతంలో బీజేపీ, అకాలీదళ్ చాలా కాలం పాటు కలిసి పనిచేశాయి. అయితే 2020లో కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలపై విభేదాల నేపథ్యంలో అకాలీదళ్ ఎన్‌డీఏ నుంచి బయటకు వచ్చింది. ఇప్పుడు 2027 ఎన్నికలకు ముందు ఈ రెండు పార్టీలు మళ్లీ చేతులు కలపడం పంజాబ్ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కూటమి ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ పార్టీలకు ఎంతవరకు సవాల్ విసురుతుంది? సీట్ల పంపకాలు ఎలా ఉంటాయి? అకాలీదళ్ నుంచి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు అవుతారు? అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

ఏపీ, తెలంగాణ మధ్య వివాదాలు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఇరు రాష్ట్రాల మధ్య నీటి వివాదాలు తలెత్తడం విచారకరమని ఆమె అభిప్రాయపడ్డారు. కొవ్వూరు పట్టణంలో నిర్వహించిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన జరిగినప్పటికీ పరస్పర సహకారం, స్నేహభావంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ప్రస్తుతం రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదాలు నెలకొనడం బాధాకరమని కవిత అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒంటెత్తు పోకడతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వైఖరి వల్ల రెండు రాష్ట్రాల మధ్య సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇక, నీటి వివాదాలు, అక్రమాల అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించాలని కవిత కోరారు. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకుని, అక్రమాలను అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రెండు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు TRS అధ్యక్షురాలు కవిత..

10 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చాం

పాలమూరు, నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్

పాలమూరుకు కేసీఆర్ నీళ్లు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..నిన్న రేవంత్ రెడ్డి మా మహబూబ్‌నగర్ కు ఒక్క ఎకరానికైనా నీళ్లిచ్చారా..? అని అడుగుతుండు.. కేసీఆర్ పట్టించుకోలేదట.. ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు అసలు సోయి.. ఉందా.. లేదా..? అని ప్రశ్నించారు.

నా దగ్గర డాక్యుమెంటెడ్ ప్రూఫ్ ఉంది.. 30 ఏండ్లలో 30 వేల ఎకరాలకు మీరు నీళ్లిచ్చారు.. కాంగ్రెస్, టీడీపీ 30 ఏండ్ల పాలనలో.. రేవంత్ రెడ్డి నీ గురువు మహబూబ్ నగర్ జిల్లాను దత్తత తీసుకున్నారు.. దత్తత జిల్లాలో నీ గురువుగారు.. ఇయ్యాళ్ల నువ్వు ముఖ్యమంత్రిగా ఉన్న కాంగ్రెస్.. 30 ఏండ్లలో శిలాఫలకాలు పెట్టుడు.. చెట్లు నాటుడని హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

30 వేల ఎకరాలకు మీరు నీళ్లిస్తే కేసీఆర్ ఒక్క పాలమూరు జిల్లాకు 10 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చారని స్పష్టం చేశారు. పాలమూరును వలసల జిల్లాను చేసిందే నీ తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు. పాలమూరును ఆగం చేసిందే మీరు..కానీ పచ్చపడగొట్టింది బీఆర్ ఎస్ ప్రభుత్వమని అన్నారు. నువ్వు ముఖ్యమంత్రి అయ్యాక 2024లో చంద్రబాబు జీవో ఇచ్చి మరీ 750 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పం నియోజకవర్గానికి నీళ్లు తీసుకుపోయాడు.మరి ఆ జీవోల గురించి ఎందుకు ఫిర్యాదు చేయలేదు..? గురుదక్షిణలో భాగమా..? అని ప్రశ్నించారు.

4 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి 10 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చాం.. కానీ నువ్వు కనీసం లక్ష ఎకరాలకైనా ఇచ్చినవా...రేవంత్ రెడ్డి అని ఫైర్ అయ్యారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకుంటూనే ఈరోజు పాలమూరులో క్రాప్ హాలిడే ఇచ్చావని మండిపడ్డారు.

కృష్ణానది పాలమూరును ఒడిసి పట్టి పారుతది కదా.. పక్కనే కృష్ణానది ఉన్నా ఇవాళ పాలమూరులో నువ్వు క్రాప్ డే ఇచ్చినవన్నారు. రైతులను పంటలు వేయొద్దన్నవ్.. నేడు పాలమూరు దాదాపు 2 లక్షల ఎకరాలు పంటలు ఎండిపోవడానికి నీ చేతగానితనం, నీ గురు దక్షిణే కారణమన్నారు.

చిల్లరగా మాట్లాడే రేవంత్ రెడ్డికి చిల్లరగానే సమాధానం చెప్పాలి.. నిన్న రేవంత్ రెడ్డి అతి తెలివితేటలు చూపిస్తూ అతిగా మాట్లాడాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మేము తెలంగాణ సోయిగల్లోళ్లం, తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ కనుక.. అణువణువునా తెలంగాణ తనాన్ని ఉన్న కేసీఆర్ నాయకత్వంలో పని చేసేటోళ్లం కనుక.. ఆనాడు తెలంగాణ వ్యతిరేకనిర్ణయాలు ఈ ప్రభుత్వం తీసుకుంటుంటే లోపల కేబినెట్‌లో పోరాడినం.. ముఖ్యమంత్రిని కలిసి కూడా ఈ నిర్ణయాలు ఉప సంహరించుకోవాలని చెప్పినమన్నారు.

ఢిల్లీలో ఈ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ దిగ్విజయ్ సింగ్‌కు, ప్రధాన మంత్రికి, సోనియాగాంధీకి కూడా కేసీఆర్ ఫిర్యాదు చేశారు.. రాజశేఖర్ రెడ్డి నిర్ణయాలు తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్నాయి.. ఆ నిర్ణయాల్లో మేం భాగస్వామ్యం కాదలచుకోలేదు.. ఈ తప్పుడు నిర్ణయాలకు మేం భాగస్వామిగా ఉండం.. మేం బయటకు వెళ్లిపోతాం.. అని స్పష్టంగా చెప్పామని హరీశ్ రావు గుర్తు చేశారు.. మీరు ఆ రోజు తెలంగాణ ఇస్తామని రాష్ట్రపతి నోట ఉభయ పార్లమెంట్ సభల్లో చెప్పించడం వల్ల, కామన్ మినిమం ప్రోగ్రామ్‌లో పెట్టడం వల్ల మీ హైకమాండ్ సోనియాగాంధీ రిక్వెస్ట్ వల్ల కేసీఆర్ ఆదేశంతో మేం కేబినెట్‌లో చేరాం.. రాజశేఖర్ రెడ్డి ఎవరు..? మాది స్వతంత్ర పార్టీ.. మేం ఆరుగురం మంత్రులం అయినమంటే అది కేసీఆర్ నిర్ణయం.. కేసీఆర్ భిక్ష. తెలంగాణకు అన్యాయం జరుగుతుందని పార్టీలో చర్చ జరిగినప్పుడు కేసీఆర్ వైదొలగాలని ఆదేశిస్తే అర్ధరాత్రి అమెరికా నుంచి ఫ్యాక్స్‌లో మంత్రి పదవులను గడ్డిపోచల్లాగా రాజీనామాలు చేసిన త్యాగం మాదన్నారు హరీశ్ రావు.

మేము రాజీనామా చేసిన తర్వాత 9 నెలలకు ఈ GOలు వచ్చాయి. దీని మీద మేం మాట్లాడితే రేవంత్ రెడ్డి ఇ నువ్వేం మాట్లాడుతవ్.. లేదు లేదు అంతకు ముందే బడ్జెట్ అప్రూవల్ అయింది.. అది బడ్జెట్‌లో ఉండదు.. పద్దులు కేబినెట్‌కు రానే రావు.. అసలు ఆ పులిచింతల, పోతిరెడ్డిపాడు కావొచ్చు.. జీవో 610 అమలు కావొచ్చు.. తెలంగాణకు సంబంధించిన అనేక నిర్ణయాలు, హండ్రీనీవా కానీ ఇలాంటి తప్పుడు నిర్ణయాలు నువ్వు తీసుకుంటున్నవ్ కనుకనే మేం తెలంగాణ కోసం సోనియాగాంధీ మీద గౌరవంతో చేరిన.. మీరు రాష్ట్రం ఇస్తమంటేనే చేరినం.. ఇలాంటి తప్పుడు నిర్ణయాలకు భాగస్వామ్యం కాదని చెప్పి రాజీనామా చేసి బయటకు వచ్చినోళ్లం మేం.. త్యాగాలు మావి.. నువ్వేం మాట్లాడుతున్నవ్ రేవంత్ రెడ్డి అని హరీశ్ రావు ఫైర్ అయ్యారు.



మూసీ పనుల్లో వేగం పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

గండిపేటలో నిర్మిస్తున్న ఆధునిక గోశాల పనులను 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. కోహెడలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ పనుల్లో వేగం పెంచాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. మార్కెట్‌కు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు సమాంతర రహదారుల నిర్మాణాన్ని కూడా పూర్తి చేయాలన్నారు.

సైబరాబాద్ పరిధిలోని ఐఐఐటీ జంక్షన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి డిజైన్లను పరిశీలించిన సీఎం, అక్కడ మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్యూర్ పరిధిలో చెరువుల పునరుద్ధరణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, ఎస్టీపీల నిర్మాణం, మెట్ల బావుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, హెచ్ఎండీఏ, హైడ్రా, జీహెచ్ఎంసీ, ఇతర పట్టణాభివృద్ధి సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మొత్తంగా హైదరాబాద్‌ను మరింత ఆధునికంగా తీర్చిదిద్దడంతో పాటు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

పెట్టుబడుల ఆకర్షణకు హార్టికల్చర్ సమిట్

అమరావతి, నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్

రైతులకు ఆదాయం పెరిగేలా సాగు విధానాల్లో మార్పులు తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. వ్యవసాయ రంగంపై సమీక్ష నిర్వహించిన సీఎం. అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ''వ్యవసాయంలో మార్పులకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలి. వ్యవసాయాన్ని మరింత ఆధునికంగా, లాభసాటిగా తీర్చిదిద్దాలి. ప్రతి సీజన్‌కు ముందే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళిక ఉండాలి. తుపాన్లను తట్టుకునేలా పంటలసాగులో మార్పులు చేయాలి.

సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల బోటు ఆచూకీ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. గాలింపు చర్యలపై అధికారులతో మాట్లాడి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బోటును గుర్తించేందుకు మరింత విస్తృతంగా గాలింపు చేపట్టాలని ఆదేశించారు. కాకినాడ జిల్లా ఉప్పాడకు చెందిన ఏడుగురు మత్స్యకారులు నవంబర్ 4న మోటరైజ్డ్ ఫిషింగ్ బోటులో వేటకు వెళ్లారు. పారాదీప్ పోర్టు సమీపానికి చేరుకున్నాక వారి నుంచి సమాచారం నిలిచిపోయింది. ఈ నెల 19 నుంచి బోటుతో సంబంధాలు తెగిపోయాయి. మొబైల్ ఫోన్లు, బోటులోని ట్రాన్స్‌పాండర్ స్విచ్ ఆఫ్ కావడంతో జీపీఎస్ ద్వారా కూడా ఆచూకీ లభించలేదు. కాకినాడ, చెన్నై, ఒడిశా కోస్ట్‌గార్డ్ అధికారుల సమన్వయంతో గాలింపు కొనసాగుతోంది. భారత కోస్ట్‌గార్డ్ నౌకలు, హెలికాప్టర్లతో పారాదీప్ తీరంలో గాలిస్తున్నారు. మత్స్యకారుల కుటుంబాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ..గాలింపు పురోగతిని వారికి తెలియజేయాలని చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు.

నంది, జాతీయ చలనచిత్ర అవార్డుల పర్యవేక్షణకు 'స్పెషల్ ఆఫీసర్'

సినీ, టీవీ, నాటక రంగాల కళాకారులకు అందించే నంది అవార్డులు, జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమాలకు సంబంధించిన ఏపీ ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. ఈ అవార్డుల వేడుకలకు అత్యంత ఘనంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఓవరాల్ ఇంఛార్జ్‌గా పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్‌ను నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. అవార్డుల ఎంపిక నుంచి వేడుకల నిర్వహణ వరకు అన్ని విభాగాల మధ్య బ్యాలెన్స్ చేస్తూ ప్రోగ్రామ్‌లను విజయవంతం చేసే బాధ్యతను రావత్ చూసుకోవాల్సి ఉంటుంది. అయితే చాలాకాలంగా ఈ అవార్డుల ప్రదానం జరగడం లేదు. దాదాపు 2017 నుంచి గ్యాప్ వచ్చింది. ఈ దిశగా ప్రభుత్వం అడుగులు వేయడంతో టాలీవుడ్‌లో జోష్ ఏర్పడింది.

అవార్డుల ప్రదానం ఎందుకు ఆగిపోయింది?

ఏపీ విభజనకు ముందు నంది అవార్డుల ప్రదానం బాగానే జరిగింది. అయితే 2014, 2015, 2016 సంవత్సరాలకు నంది అవార్డులపై 2017 నవంబర్‌లో అప్పటి ప్రభుత్వం ప్రకటన చేసింది. కానీ ఆ కార్యక్రమం జరగలేదు. అప్పట్లో అవార్డు ఎంపికపై సినీ పరిశ్రమలో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దాంతో ఆ ఏడాది ఆ పురస్కారాల ప్రదానానికి బ్రేక్ పడింది. అలాగే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా..నంది అవార్డుల ప్రస్తావనే తేలేదు. అంటే 2017 నుంచి 2026 వరకు అవార్డు ప్రకటనే లేదు. అయితే కొన్నేళ్లు నంది అవార్డుల ప్రదానం మళ్లీ జరగాలని సినీ వర్గాలు కోరుతున్నాయి.

పురుషులు పందుల్లా వారిని చూస్తున్నారు

పాట్నా, నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్

మహిళలు ముఖ్యంగా వివాహ సమయంలో వధువుల వస్త్రధారణపై అసదుద్దీన్ ఒవైసీ పార్టీకి చెందిన బిహార్ ఎమ్మెల్యే అఖ్తరుల్ ఇమాన్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'వధువు వేశ్యలా అలంకరించుకుని కూర్చుంటే.. పురుషులు పందుల్లా చూస్తున్నారని.. మహిళలు పరదా వేసుకోవడం లేదని'' ఏఐఎంఐఎం బిహార్ అధ్యక్షుడు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఆయనను చిక్కుల్లో పడేశాయి. ముస్లిం వివాహాల్లో జరుగుతున్న ఆచారాల గురించి ఆయన మాట్లాడుతూ.. అత్యంత జుగుప్సాకరమైన భాషను ఉపయోగించారు. 'ముహ్ దిఖాయి' (అతిథుల ముందు వధువు ముఖాన్ని చూపించే ఆచారం) సంప్రదాయాన్ని బహిరంగంగా కూర్చునే 'తవాయిఫ్' (వేశ్య)తో పోల్చారు. మహిళలు తలపై ముసుగు వేసుకోకుండా పెళ్లిళ్లకు హాజరవుతున్నారని అసహనం వ్యక్తం చేశారు.

ఆడ, మగ కలిసి తిరగడం పందుల లక్షణం..ఎమ్మెల్యే పరదా లేకుండా కూర్చున్న ముస్లిం వధువులను పురుషులు చూడటంపై బహిరంగ సభలో ఎంఐఎం ఎమ్మెల్యే మండిపడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో ఆయన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగుతోంది. ఆ వీడియోలో ''నేను మా పురుషులను ఒకటే అదగాలనుకుంటున్నాను, మీకు సిగ్గు, శరం ఏమైనా ఉందా? ఇలా విచ్చలవిడిగా కలిసి తిరగడం పందుల లక్షణం'' అని ఇమాన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం వినిపిస్తోంది.



పరదా వేసుకోని మహిళలపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. ''ఈ రోజుల్లో తలపై చున్నీ వేసుకునే మహిళల కంటే, టోపీలు ధరించే పురుషులే ఎక్కువగా ఉన్నారు'' అని అన్నారు. ''ఇస్లాంలో మహిళలకు పరదా తప్పనిసరి'' అని ఆయన వాదించారు. ఎంఐఎం ఎమ్మెల్యే ఇమాన్ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయనపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మండిపడ్డాయి. షరియా చట్టంపై ఆయనకు అంత ఆందోళన ఉంటే అఫ్ఘనిస్థాన్‌కు వెళ్లిపోవాలని బీజేపీ విమర్శించింది. అయినా, ఇమాన్ మాత్రం పెళ్లైన హిందూ మహిళలకు సిందూరం కంటే ముస్లిం మహిళలకు పరదా ఎంతో ముఖ్యమని తన వ్యాఖ్యలను సమర్థించుకోవడం గమనార్హం. ''నా మాటలు సరైన సమయానికి నిద్రలేవడానికి మొండికేసే పిల్లాడికి కొట్టే చెంప దెబ్బ లాంటివి'' అని పేర్కొన్నారు.

ఇమామ్‌పై బీజేపీ, కాంగ్రెస్‌లు తీవ్ర ఆగ్రహం

బీజేపీ నేత దానిష్ ఇక్బాల్ దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ''మహిళలను కించపరిచేలా, వారి హక్కులను కాలరాసేలా మాట్లాడే తిరోగమన మౌలానాల మాదిరిగా ఒక ఎమ్మెల్యే మాట్లాడటం విచారకరం'' అని అన్నారు. ''మన మహిళలు విద్యావంతులై అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఆయనకు (ఇమాన్‌కు) షరియా గురించి అంతగా చింత ఉంటే, అఫ్ఘానిస్థాన్‌కు వెళ్లిపోవాలి'' అని ఇక్బాల్ అన్నారు.

ఇమాన్ వ్యాఖ్యలు అత్యంత అసహ్యకరమైనవిగా కాంగ్రెస్ నాయకురాలు ముంతాజ్ అభివర్ణించారు. మహిళలను ఈ విధంగా కించపరచడానికి ఇస్లాం అనుమతించదని ఆమె వ్యాఖ్యానించారు. ''సమాజానికి ప్రతినిధులమని చెప్పుకునే వారు, ముఖ్యంగా ముస్లింలకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకునే ఏఐఎంఐఎం వంటి పార్టీకి చెందిన వారు మహిళల గురించి ఇంత నీచంగా మాట్లాడటం చాలా అసహ్యంగా ఉంది. ఇస్లాం ఎక్కడా మహిళలను అలా కించపరచదు. నేను ఈ ప్రకటనను ఖండిస్తున్నాను. ఒక ముస్లిం మహిళగా, ఇది ముమ్మాటికీ తప్పు అని నేను భావిస్తున్నాను'' అని ఆమె అన్నారు.

ఎంఐఎం ఎమ్మెల్యే వ్యాఖ్యలపై మత పెద్దల నుంచి కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇస్లామిక్ సెంటర్ ఆఫ్ ఇండియా ఛైర్మన్, లక్నోకు చెందిన మత గురువు మౌలానా ఖలీద్ రషీద్ ఫరంగీ మహలీ స్పందిస్తూ..''కొందరు ఉపయోగించే ఇలాంటి భాషకు మన నాగరిక సమాజంలో చోటు లేదు. ఎవరైనా ఇలాంటి ప్రకటనలు చేయడం, ఇలాంటి పదాలను వాడటం సమంజసం కాదు'' అని అభిప్రాయపడ్డారు. అయినాసరే, ఇమాన్ ఏమాత్రం తన వ్యాఖ్యలపై వెనక్కి తగ్గడం లేదు. తన వ్యాఖ్యలు విశ్వాసాలు, ఆచారాలను పాటించే ముస్లింల కోసం ఉద్దేశించినవేనని ఆ ఎమ్మెల్యే పేర్కొన్నారు.

తిరుమల శ్రీవారి భక్తులకు

బీమా సొమ్ము అందజేత

(మొదటి పేజీ తరువాయి)

గత రెండు నెలల్లో శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు విచ్చేసి సహజంగా మరణించిన ఏడుగురు భక్తుల కుటుంబ సభ్యులకు తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఎల్ఐసీ ఆఫ్ ఇండియా సీఈవో, ఎండీ ఆర్.దొరైస్వామిలతో కలిసి మంగళవారం రూ.2 లక్షలు చొప్పున బీమా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న మృతుల కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు.

ఈ సందర్భంగా ఈవో రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9న ఈ పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. దేశానికే ఆదర్శవంతంగా ఉండేలా శ్రీవారి యాత్ర సురక్ష పథకాన్ని రూపొందించామన్నారు. సహజ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాదంలో మరణించిన వారికి రూ.10 లక్షల చొప్పున అందించడం జరుగుతుందన్నారు. గత రెండు నెలల్లో 17 మంది భక్తులు తిరుమలలో మరణించారని, వారిలో ఏడుగురి సభ్యులకు బీమా పరిహారాన్ని అందించామన్నారు. మిగిలిన వారికి త్వరలో అందిస్తామని తెలిపారు.

అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. దేశానికి ఆదర్శవంతంగా ఉండేలా ఈ బీమా పథకాన్ని తీసుకొచ్చేందుకు ఏడదిన్నర పాటు కృషి చేసినట్లు చెప్పారు. తితిదే కోసం ఈ బీమా పథకాన్ని ప్రత్యేకంగా తీసుకొచ్చేందుకు సహకరించిన ఎల్ఐసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో బీమా పరిహారాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. దర్శనం టికెట్లు ముందుగానే బుక్ చేసుకున్న వారితో పాటు నేరుగా వచ్చే భక్తులందరికీ ఈ బీమా వర్తిస్తుంది. దర్శన టికెట్లు ఉన్నవారి వివరాలు నేరుగా ఎల్ఐసీ డేటాబేస్‌లో నమోదవుతాయి. టికెట్ లేనివారు క్యూలైన్లలోకి ప్రవేశించగానే తిరుమలలోని ఇంటిగ్రేటె

ఉక్రెయిన్‌పై మాస్కో భీకర దాడులు



ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు కొనసాగిస్తోంది. కీవ్ సమీపంలోని ఓ గ్రామంలో ఐదంతస్తుల అపార్టుమెంటు లక్ష్యంగా మాస్కో ఆదివారం జరిపిన దాడిలో 11 మంది మృతి చెందారు. జపోరిజియాలో ఓ ఆసుపత్రి పై సోమవారం జరిగిన దాడిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. క్రమటోర్స్క్ నగర సమీపంలో ఓ వాహనాన్ని లక్ష్యంగా చేసుకోవడంతో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు.

ఉక్రెయిన్ దాడులతో రష్యాలోని రొస్తావ్ ప్రాంతంలో ఓ ఆయిల్ రిఫైనరీ దెబ్బతింది.

తాము స్వదేశీ ఆయుధాలను అభివృద్ధి చేసుకుంటూ.. రష్యా దూకుడుకు గట్టి బదులిస్తున్నామని జెలెన్‌స్కీ చెప్పారు. బెర్లిన్ వేదికగా జరిగిన నాటో పార్లమెంటరీ అసెంబ్లీ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా ఆయన ప్రసంగించారు. ఆయుధ రవాణా కోసం రష్యా ఉపయోగించే ఎంవీ అంగరా అనే నౌకపైనా తాము దాడి చేసినట్లు తెలిపారు.

యెమెన్‌పై దాడుల్లో ఆరుగురి మృతి

యెమెన్‌లోని హూడీదా ప్రావిన్సులో టెలికమ్యూనికేషన్ సదుపాయాలతో పాటు ఓ నివాస భవనంపై సౌదీ మద్దతున్న బలగాలు దాడులు చేశాయి. ఈ దాడుల్లో ఆరుగురు మృతి చెందారు. 18 మంది గాయపడ్డారు. మరింత మంది శిథిలాల కింద చిక్కుకుని ఉండొచ్చని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇరాన్ వద్ద ఒకేసారి రెండు క్షిపణుల్ని ప్రయోగించే లాంచర్!

అమెరికాతో ఉద్రిక్తతల వేళ ఇరాన్ సైన్యం సంచలన వీడియో విడుదల చేసింది. ఒకేసారి రెండు క్షిపణులను ప్రయోగించగల కొత్త లాంచర్‌ను అందులో ప్రదర్శించింది. ద్రవ ఇంధనంతో నడిచే ఈ వ్యవస్థను ఇరాన్ దళాలు బహిరంగంగా ప్రదర్శించడం ఇదే మొదటిసారి. నౌకా విధ్వంసక క్షిపణులు, సముద్ర మందుపాతరలు వీడియోలో కనిపించాయి. అమెరికా మరోసారి భీకర దాడులకు దిగొచ్చని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. తమ సామర్థ్యాలను తక్కువగా అంచనా వేయొద్దని హెచ్చరించేందుకే ఇరాన్ ఈ వీడియో విడుదల చేసి ఉండొచ్చని విశ్లేషణలు వెలువడుతున్నాయి.

డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు షేక్ హసీనా



భారత్‌లో రెండేళ్లకుపైగా ఆశ్రయం పొందుతోన్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కీలక నిర్ణయం తీసుకున్నారు. డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్తానని ప్రకటించారు. ఏటా డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌లో విక్టరీ డే నిర్వహిస్తారు. అదే రోజును ఆమె స్వదేశానికి తిరిగి వెళ్లడానికి ఎంపిక చేసుకోవడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. '2024 ఆగస్టు 5న తాను బంగ్లాదేశ్ విమానంలో భారత్‌కు వచ్చినందున.. తిరిగి దిల్లీ నుంచి తీసుకువెళ్లడానికి బిమాన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్‌ను పంపాలని హసీనా బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆ సమయంలో రాజ్యాంగానికి విరుద్ధంగా ఆమెను బహిష్కరించినందున.. డిసెంబర్ 16న విక్టరీ డే రోజున ఆమె గౌరవంగా బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చేలా చూడటం ఇప్పుడు ప్రభుత్వ బాధ్యత' అని హసీనా సహాయకుడు పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లడానికి హసీనా కొంత కాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తనకు కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు జారీ చేయాలని ఆమె బంగ్లాదేశ్ (Bangladesh)ను అభ్యర్థించారు. మరోవైపు ఆమెను స్వదేశానికి పంపాలంటే ఆదేశం తమ సైనిక విమానాన్ని పంపాలని.. లేదా ఇరుదేశాల భూ సరిహద్దు మార్గంలో పొరుగు దేశ సైన్యం హసీనాను మర్యాదపూర్వకంగా ఆహ్వానించాలని భారత్ షరతులు విధించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె తిరిగి వెళ్లే తేదీని ఖరారు చేయడం గమనార్హం. అయితే ఈ విషయంపై బంగ్లా ప్రభుత్వం ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఒకవేళ హసీనా తిరిగి దేశానికి వస్తే.. ఆమెను కచ్చితంగా అరెస్ట్ చేస్తామని బంగ్లా ప్రభుత్వ వర్గాలు స్థానిక మీడియాకు తెలిపాయి. అదే సమయంలో ఆమెను తీసుకురావడానికి విమానాన్ని పంపడం గురించి భారత్‌తో ఎలాంటి అధికారిక చర్చలు జరగలేదని పేర్కొన్నాయి.

నాకు కంప్యూటర్ కూడా లేదు

: ఎన్విడియా హెడ్ ఆఫీస్‌లో జెన్సన్ భావోద్వేగ క్షణాలు

: ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్‌కు సంస్థ ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. సీఈఓగా తిరిగి బాధ్యతలు చేపట్టిన అనంతరం కాలిఫోర్నియాలోని శాంటా క్లారాలో ఉన్న కంపెనీ ప్రధాన కార్యాలయానికి ఆయన చేరుకున్నారు. 'జెన్సన్.. జెన్సన్' అంటూ నినాదాలు చేస్తూ ఉద్యోగులు ఆయనకు చప్పట్లతో స్వాగతం చెప్పారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఇటీవల సీఈఓ పదవికి రాజీనామా చేసిన జెన్సన్‌ను నవంబర్ 23న సంస్థ బోర్డు తిరిగి అదే బాధ్యతల్లో నియమించింది. బోర్డు ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ఆయన భావోద్వేగంగా మాట్లాడారు. ''నాకు రెండో అవకాశం ఇచ్చిన మీ అందరికీ ధన్యవాదాలు. సీఈఓగా మరింత మెరుగ్గా పనిచేసేందుకు ప్రయత్నిస్తాను. మీ అందరినీ ఇబ్బంది పెట్టినందుకు క్షమించండి''అని పేర్కొన్నారు. జెన్సన్ మాట్లాడుతోన్న సమయంలో ఓ మహిళా ఉద్యోగి ఆయనను కౌగిలించుకోవడంతో అక్కడ భావోద్వేగ వాతావరణం నెలకొంది.

ఉద్యోగులను ఉద్దేశించి జెన్సన్ సరదాగా మాట్లాడుతూ.. ''ఇది నా మొదటి రోజు. నా దగ్గర కంప్యూటర్ కూడా లేదు. ఐటీ విభాగం నాకు కొత్త పీసీ ఇవ్వాల్సి ఉంటుంది'' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. మరోవైపు జెన్సన్ తిరిగి రావడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా హర్షం వ్యక్తం చేశారు.

హర్షం వ్యక్తం చేసిన మస్క్..

ఎన్విడియా సీఈఓగా జెన్సన్‌ను తిరిగి నియమించడంపై టెస్లా అధినేత ఎలాన్ మస్క్ హర్షం వ్యక్తం చేశారు. ''జరిగిన పొరపాటును సరిదిద్దారు'' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. అంతకుముందు మరో పోస్టులో 'ఇది



పూర్తయింది' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జెన్సన్‌కు మద్దతుగా నిలిచినందుకు ఓ నెటిజన్ థాంక్స్ చెప్పగా.. మస్క్ రిప్లై పెట్టారు. ''పరిస్థితులు బాగున్నప్పుడు అందరూ నీ స్నేహితులే. కానీ కష్టకాలంలో నీకు అండగా నిలిచేవారే నీ నిజమైన స్నేహితులు'' అని పేర్కొన్నారు.

నడినెత్తిపైకి అణ్వాయుధాలు.. రష్యా సమాయత్తం!



అంతరిక్షంలో అణ్వాయుధాలను మోహరించేందుకు అగ్రదేశాలు పోటీపడుతున్నాయి. ఇప్పటికే అణ్వాయుధాలను మోహరించినట్లు అమెరికా అంగీకరించగా.. 2026 చివరి నాటికి రష్యా కూడా అణ్వాయుధంతో కూడిన ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నట్లు జర్మనీ సంచలన నివేదిక బయటపెట్టింది. ఒకవేళ అదే జరిగితే.. భూ కక్ష్యలో అణ్వాయుధాల మోహరింపు, అంతరిక్షంలో పేలుళ్లను నిరోధించే 1963 నాటి పాక్షిక అణు నిషేధ ఒప్పందతోపాటు, 1967 నాటి అంతరిక్ష ఒప్పందాన్ని కూడా రష్యా ఉల్లంఘించినట్లవుతుంది.

జర్మన్ ఇంటెలిజెన్స్ రిపోర్టు, అక్కడి మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. కేవలం 60 రోజుల్లో అంతరిక్షంలోకి అణ్వాయుధాలను ప్రవేశపెట్టేలా మాస్కో సమాయత్తమవుతోంది. ఆ వ్యూహాల గురించి జర్మనీ రక్షణశాఖ మంత్రికి ఆ దేశ ఇంటెలిజెన్స్ వర్గాలు ఇప్పటికే సమాచారం అందించాయి. కాగా, ఆ దేశంలోని పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు జర్మనీ రక్షణశాఖ వెల్లడించింది. జర్మన్ నివేదికకు మరింత బలం చేకూరేలా.. రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ టాస్ ఓ కథనం వెలువరించింది. ఉక్రెయిన్, నాటో సభ్యదేశాలు తీసుకున్న నిర్ణయాలే.. మాస్కో అణ్వాయుధాలను ఉపయోగించే అవకాశాన్ని పరిశీలించేలా చేస్తున్నాయని పేర్కొంది. రష్యా భద్రతా మండలి డిప్యూటీ ఛైర్మన్ దిమిత్రి మెద్వదేవ్ మాటలను ఉటంకిస్తూ ఈ కథనం రాసుకొచ్చింది. అయితే, కీలక నిర్ణయాలు తీసుకునే ముందు అధ్యక్షుడు పుతిన్ అన్ని అంశాలను సమగ్రంగా విశ్లేషిస్తారని, జరిగిన నష్టాన్ని బట్టే ప్రతీకార చర్య ఉంటుందని స్పష్టం చేసింది.

మరోవైపు జర్మనీ ఇంటెలిజెన్స్ రిపోర్టు గురించి తమకేమీ తెలియదని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ అన్నారు. ఎవరో చేసిన ఆరోపణల గురించి సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఈ నివేదికపై బెర్లిన్‌లోని రష్యా రాయబార కార్యాలయం కూడా స్పందించింది. అవన్నీ నిరాధార ఆరోపణలని కొట్టిపారేసింది. మాస్కో అణు ఉపగ్రహాల గురించి గతంలో అమెరికా కూడా కీలక వ్యాఖ్యలు చేసింది. శత్రు ఉపగ్రహాలను నాశనం చేసేందుకు సరికొత్త వ్యవస్థను ఆ దేశం అభివృద్ధి చేస్తోందని 2024లోనే ఆరోపించింది. వీటిని అప్పట్లోనే క్రెమ్లిన్ ఖండించింది. తాజాగా ఉక్రెయిన్ సైనికులు ఉపయోగిస్తున్న స్టార్‌లింక్ ఇంటర్నెట్ వ్యవస్థ ఉపగ్రహ నెట్‌వర్క్‌ను నాశనం చేయగల అణ్వాయుధాన్ని రష్యా చాలా సంవత్సరాలుగా అభివృద్ధి చేస్తోందని ఇటీవల మరోసారి అమెరికా చెప్పుకొచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో రష్యా అంతరిక్ష అణ్వాయుధ ప్రయోగంపై జర్మనీ ఇంటెలిజెన్స్ రిపోర్టు పలు అనుమానాలు రేకెత్తిస్తోంది.

ఎన్నికల్లో ఓటమితో వీధి దీపాల తొలగింపు



పంచాయతీ ఎన్నికల్లో ఓడిపోవడంతో ఓ అభ్యర్థి ఎన్నికలకు ముందు ఏర్పాటు చేసిన వీధి దీపాలను తీయించారు. ఈ ఘటన రాజస్థాన్‌లోని టోంక్ జిల్లా పీప్లు పంచాయతీ రెండో వార్డులో చోటుచేసుకుంది. టోంక్ జిల్లాలోని పలు గ్రామాల్లో ఇటీవల పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికలకు ముందు నివాయి ఎమ్మెల్యే రామ్ సహాయ్ వర్మ వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పని చేసే అలోక్ శర్మ రనోలి పలు గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలకు సుమారు 50 ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో భాజపా తరపున 4వ వార్డు నుంచి పంచాయతీ సమితి సభ్యురాలిగా పోటీ చేసిన ఆయన భార్య ప్రియాంక శర్మ ఓడిపోయారు.


తన భార్య ఓడిపోయినందుకు అలోక్ శర్మ మనుషులు 10 వీధి దీపాలను తొలగించారని స్థానికులు ఆరోపించారు. ప్రియాంక శర్మ ఎన్నికల్లో ఓడిపోవడంవల్లే వీధి దీపాలను తొలగించారనే ఆరోపణలను ఎమ్మెల్యే రామ్ సహాయ్ వర్మ తోసిపుచ్చారు. దీపావళికి ముందు అభ్యర్థులు ఈ లైట్లను ఏర్పాటు చేశారని, విద్యుత్ బిల్లుల విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత వాటిని తొలగించారని తెలిపారు. మరోవైపు.. విద్యుత్ స్తంభాలకు అనధికారంగా ఏర్పాటు చేసిన వీధి దీపాలను తాము తొలగించినట్లు జైపుర్ విద్యుత్‌శాఖ సిబ్బంది వెల్లడించారు. స్థానికులు గొడవ చేయడంతో మరో 40 స్తంభాలవద్ద దీపాలను తొలగించే ప్రక్రియను నిలిపివేసినట్లు తెలిపారు.

ఆయుర్వేద లడ్డూలు.. అదిరే వ్యాపారం



సంప్రదాయ మూలికలతో వివిధ రకాల లడ్డూలు తయారు చేస్తూ లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు బిహార్‌కు చెందిన మంటూ కుమార్. రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వార్షిక టర్నోవర్ సాధించే స్థాయికి ఎదిగారు. రోహ్‌తాస్ జిల్లా ససారామ్‌కు చెందిన మంటూ కుమార్ తొలుత ఉద్యోగం కోసం ముంబయి వెళ్లారు. అక్కడ మూడేళ్లకుపైగా పని చేశారు. 2011లో బిహారీలను వెళ్లగొట్టాలన్న 'బిహారీ బాగో' ఉద్యమం సమయంలో ఆయనకు కష్టాలు మొదలయ్యాయి. దాడులు, అవమానాలతో బిహార్‌కు తిరిగొచ్చారు. సొంతంగా వ్యాపారం ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. మంటు కుటుంబానికి తరతరాలుగా మూలికలతో ఔషధాలు తయారు చేసే అలవాటు ఉంది. చ్యవన్‌ప్రాశ్‌తో (ఉసిరి, నెయ్యి, తేనె వంటి పలు ఔషధాలతో చేసే మిశ్రమం) పాటు మలబద్ధకం సమస్యలకు మందులు తయారు చేసేవారు. తన పరిశోధన, ఆచరణాత్మక అనుభవంతో మంటు కొత్తగా లడ్డూల తయారీ ప్రారంభించారు. ప్రస్తుతం 15 రకాల లడ్డూలు తయారు చేస్తున్నారు. ఒక్కో రకంలో విభిన్నమైన మూలికలను ఉపయోగిస్తున్నారు. శొంఠి, పచ్చి పసుపు, మెంతులు, అవిసె గింజల లడ్డూ, అశ్వగంధ లడ్డూలు ఆయన ప్రత్యేకం. సుమారు 20 మందికి ఆయన ఉపాధి కల్పిస్తున్నారు. పట్నాలోని ఖాదీ మాల్‌లో లడ్డూలను విక్రయిస్తున్నారు. ప్రభుత్వ ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాల్లోనూ తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతున్నారు.

అక్రమ నిర్మాణదారులతో అధికారుల కుమ్మక్కు ఆందోళనకరం



దేశవ్యాప్తంగా భవన నిర్మాణ నిబంధనలు తీవ్ర ఉల్లంఘనలకు గురి కావడంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అక్రమార్కులతో మున్సిపల్ అధికారులు కుమ్మక్కై సహకారం అందించడంపైనా మండిపడింది. పట్టణ ప్రణాళిక విభాగం ముందస్తు అనుమతులను తమ కళ్ల ముందే అతిక్రమిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవా ధర్మాసనం అభిప్రాయపడింది. అనధికార నిర్మాణాలపై దాఖలైన వ్యాజ్యంపై సోమవారం విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. భవన నిర్మాణం ప్రతి దశనూ నిశితంగా పరిశీలిస్తూ అతిక్రమణలకు పాల్పడితే వెంటనే కూల్చివేతలకు ఆదేశాలివ్వాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. తగు చర్యలను అధికారులు సకాలంలో తీసుకోకపోవడంతో అక్రమ నిర్మాణాలు మరింతగా పెరిగిపోతున్నాయని ఆక్షేపించింది. అతిక్రమణల వల్ల పౌర సదుపాయాలపై తీవ్ర ప్రభావం పడుతోందని, వాహనాలతో రహదారులు కిక్కిరిసిపోతున్నాయని, మురుగునీటి పారుదలకు అంతరాయం కలుగుతోందని పేర్కొంది. చట్టబద్ధంగా వ్యవహరిస్తూ రాజ్యాంగ నిబంధనలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని తెలిపింది.

మేలో బుల్లెట్ రైలు ప్రయోగాత్మక పరుగు



అహ్మదాబాద్‌ముంబయి మధ్య నిర్మిస్తున్న తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టు ట్రయల్ రన్ వచ్చే ఏడాది మేలో జరగనుందని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ''508 కి.మీ. మేర నిర్మిస్తున్న బుల్లెట్ రైలు ప్రాజెక్టులో సూరత్ నుంచి బిలిమోరా మధ్య 50 కిలోమీటర్ల తొలి సెక్షన్ పూర్తయింది. 3 రోజుల క్రితమే విద్యుదీకరణ అయింది. సిగ్నలింగ్ జనవరిలో పూర్తవుతుంది. బెంగళూరులో తయారవుతున్న బి28 రైలు మే నెలలో అందుబాటులోకి వస్తుంది. అదే నెలలో ట్రయల్ రన్ నిర్వహిస్తాం. ఇది గంటకు 280 కిలోమీటర్ల వేగంతో నడుస్తుంది. తదుపరి దశలో 350 కిలోమీటర్ల వేగంతో నడిచే రైళ్లు అందుబాటులోకి తెస్తాం. 2029 నాటికి పూర్తిస్థాయిలో బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తుంది'' అని ఆయన తెలిపారు.

తిరుప్పరంకుండ్రం కొండపై కార్తికదీపం వెలిగిస్తారా?లేదా?.. కొనసాగుతున్న సందిగ్ధత

తమిళనాడులోని తిరుప్పరంకుండ్రం కొండపై కార్తికదీపం వెలిగించే విషయంలో వివాదం కొనసాగుతోంది. కార్తిక పౌర్ణమి రోజున కొండపై ఉన్న స్తంభంపై దీపం వెలిగించాలని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం తరపున రివ్యూ పిటిషన్ దాఖలైంది. దీంతో మంగళవారం సాయంత్రం కొండపై దీపం వెలిగిస్తారా? లేదా? అనే సందిగ్ధత నెలకొంది. తిరుప్పరంకుండ్రంలో ప్రస్తుతం 144 సెక్షన్ అమల్లో ఉంది. దీంతో అక్కడ పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. మదురై పోలీస్ కమిషనర్ రాజేంద్రన్ ఆదేశాల మేరకు కొండ చుట్టూ నలుగురు డీఐజీలు, ఏడుగురు ఎస్పీలు, పదిమంది అదనపు ఎస్పీలు, 45 మంది డీఎస్పీలు, 100 మందికి పైగా ఇన్స్పెక్టర్లు సహా సుమారు 7,000 మంది పోలీసులు ఉన్నారు. తిరుపరంకుండ్రంలో ఈ స్థాయిలో పోలీసుల మోహరింపు ఇదే తొలిసారి.

మరోవైపు తిరుపరంకుండ్రం స్తంభంపై దీపం వెలిగించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పలువురు భాజపా, హిందూ మున్నని నేతలు బయల్దేరగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. పాలయంకొట్టైలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రను గృహనిర్బంధం చేశారు. తిరునెల్వేలి, తూత్తుకుడి, కన్యాకుమారి జిల్లాల్లో 750 మందిని పోలీసులు సోమవారం రాత్రి వారి ఇళ్ల వద్దే నిలువరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆయా చోట్ల బందోబస్తు ఏర్పాటు చేశారు.

మత్తులో మునిగితే జీవితం చిత్తే

- వ్యసనానికి దూరంగా ఉండండి

- దేశ యువతకు ప్రధాని పిలుపు

దేశ యువత మాదక ద్రవ్యాల వ్యసనానికి దూరంగా ఉండాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. యువజనం మాదకద్రవ్యాలకు బలైతే వారి కుటుంబాల కలలు ధ్వంసమౌతాయన్నారు. సిక్కు మత వ్యవస్థాపకుడు గురునానక్ దేవ్ జయంతికి ఒకరోజు ముందు దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జీత్ సింగ్ అధికార నివాసంలో జరిగిన "శబద్ కీర్తన్" కార్యక్రమంలో మాట్లాడుతూ...అన్ని వర్గాలు, గురుద్వారాలు, సామాజిక సంస్థలు కలసికట్టుగా వ్యసనాలకు బానిసలైన యువతకు మార్గనిర్దేశం చేయాలని, సరైన మార్గాన్ని ఎంచుకునేలా యువతకు ధైర్యం నూరిపోయాలని ఆయన అన్నారు. 2029కల్లా దేశం నుంచి మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించాలని తమ ప్రభుత్వం శపథం పూనిందని తెలిపారు. "వివాదాలు, విధ్వంసాలు ప్రపంచ ప్రజలందరిని కుదిపేస్తున్న నేపథ్యంలో అందరి మేలునూ కోరుతూ 'సర్బత్ దా భలా' అంటున్న గుర్బాణీ (సిక్కు గురువుల వాణి) వచనం ప్రపంచ ప్రజానీకం అందరికీ ఆచరణీయం" అని మోదీ అన్నారు.



భారత టెలికాంపై గుత్తాధిపత్యం!

స్టార్‌లింక్ వివాదం నుంచి 2జీ కుంభకోణం వరకు, స్పెక్ట్రమ్ కేటాయింపుల నుంచి ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ ఎదుర్కొంటున్న సవాళ్ల వరకు టెలికాం రంగాన్ని వెంటాడుతున్న అసలు ప్రశ్న ఒక్కటే. ప్రజల సంపదపై హక్కు ఎవరిది? ప్రభుత్వ విధానాలను నిర్ణయించేది ప్రజా ప్రయోజనమా? కార్పొరేట్ ప్రయోజనమా? ఒకప్పుడు టెలిఫోన్ కనెక్షన్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసిన దేశం నేడు ప్రపంచంలోనే అతిపెద్ద టెలికాం మార్కెట్లలో ఒకటిగా ఎదిగింది. కోట్లాది మంది చేతుల్లో స్మార్ట్‌ఫోన్లు, జీవితంలో భాగమైన ఇంటర్నెట్, డిజిటల్ చెల్లింపుల నుంచి విద్య, వైద్యం, వ్యాపారం, ప్రభుత్వ సేవల వరకు విస్తరించిన టెలికాం వ్యవస్థ... ఇవన్నీ సాంకేతిక అభివృద్ధికి నిదర్శనాలు. కానీ ఈ విస్తరణ వెనుక స్పెక్ట్రమ్ కేటాయింపుల వివాదాలు, లైసెన్స్ ఫీజుల లెక్కలపై ఆరోపణలు, రాజకీయ అవినీతి కేసులు, ప్రభుత్వ రంగ సంస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా ఉన్నాయి. మార్కెట్ కొద్దిమంది ప్రైవేట్ దిగ్గజాల చేతుల్లోకి కేంద్రీకృతమవుతున్నవేళ, స్టార్‌లింక్ ప్రవేశం స్పెక్ట్రమ్ కేటాయింపులు, ప్రభుత్వ ఆదాయ రక్షణ, జాతీయ భద్రత, సమాన పోటీపై కీలక ప్రశ్నలను ముందుకు తెచ్చింది.

భారత టెలికాం రంగంలో ఎలన్‌మస్క్ 'స్టార్‌లింక్' ప్రవేశం కేవలం జియో, ఎయిర్‌టెల్ వంటి దిగ్గజాలతో నయా ఆధిపత్య పోరు మాత్రమే కాదు. పరిమిత సహజ వనరు అయిన రేడియో స్పెక్ట్రమ్ కేటాయింపులపై పారదర్శకతను కోరే మౌలిక పరీక్ష. స్పెక్ట్రమ్ అనేది ఏ ఒక్కరి వ్యాపార ఆస్తి కాదు, అది దేశ ప్రజా వనరు. ప్రభుత్వ రాబడి, వినియోగదారుల ప్రయోజనాలు, సమాన పోటీ వాతావరణం జాతీయ భద్రతలకు ఏ మాత్రం భంగం కలగకుండా, అనుమతుల ప్రక్రియలో ఏ సంస్థకూ కొమ్ముకాయకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలి.


1999 నాటి లైసెన్స్ ఫీజు సవరణ మొదలు వైర్‌లెస్ ఇన్ లోకల్ లూప్ (WiLL) దుర్వినియోగం, రూ.1,300 కోట్ల డైవర్షన్ కుంభకోణాలు, విదేశీ పెట్టుబడుల ఉల్లంఘనలు, 122 లైసెన్సుల రద్దుకు దారితీసిన 2జీ స్కామ్ వరకు టెలికాం చరిత్రంతా కార్పొరేట్ శక్తులకు పాలకులు మోకరిల్లిన నగ్న సత్యమే. ఒకవైపు బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌ల రెక్కలు విరుస్తూ మంత్రులే జైలుపాలయ్యేంతగా అవినీతి వేర్లు లోతుగా పాతుకుపోగా, 2014లో 'కుంభకోణ రహిత' నినాదంతో వచ్చిన బీజేపీ ప్రభుత్వం సైతం పాత ఉదార విధానాలనే కొనసాగిస్తోంది. ప్రభుత్వాలు మారుతున్నా లక్షల కోట్ల విలువైన ప్రజా వనరులను కొద్దిమంది ప్రైవేట్ వ్యక్తుల స్వార్థానికి తాకట్టు పెట్టే వ్యవస్థీకృత దోపిడీ ఇప్పటికీ నిరంతరాయంగా కొనసాగుతుండటమే అత్యంత విచారకరం.

సహజ వనరులు, ప్రజా మౌలిక సదుపాయాల ఆధారంగా వేల కోట్లు ఆర్జించే ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ప్రతి పైసానూ సక్రమంగా లెక్కచెప్పాల్సిందే. 2019 నాటి ఏజీఆర్ (Adjusted Gross Revenue) వివాదంలో సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్లుగా ప్రభుత్వ రాబడి వసూలు ఎంత కీలకమో, అసలు విధానపరమైన లోపాలే తలెత్తకుండా ఆరంభం నుంచే పారదర్శక నియమాలు అమలు చేయడం అంతకంటే ముఖ్యం. లాయర్లు, ఆర్థిక సలహాదారుల బలంతో కార్పొరేట్ దిగ్గజాలు రహస్య ఒత్తిళ్లతో విధానాలను తమకు అనుకూలంగా మలచుకోవడం ప్రజాస్వామ్యానికే పెనుముప్పుగా మారగా.. 2016లో మొబైల్ రంగంలో మొదలైన తీవ్రమైన ధరల పోటీకి చిన్న కంపెనీలు కనుమరుగై మార్కెట్ కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవ్వడం, దానికితోడు దేశవ్యాప్తంగా సామాన్యులకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్‌ను కావాలనే బలహీనపరచడం పాలకుల తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనం. నేడు స్టార్‌లింక్ ప్రవేశ వివాదంలోనైనా ఎవరి స్వార్థ ఆరోపణలకో, కార్పొరేట్ లాబీయింగ్‌కో లొంగకుండా, ప్రజా ప్రయోజనాలే పరమావధిగా నియంత్రణ సంస్థలు తీసుకునే ప్రతి నిర్ణయాన్నీ నిష్పక్షపాతంగా ప్రజల ముందు ఉంచాలి.

ప్రారంభంలో చౌకైన డేటా పేరుతో పోటీదారులను మార్కెట్ నుంచి తరిమేసి, ఆపై గుత్తాధిపత్యంతో ధరలు పెంచే కార్పొరేట్ వ్యూహాలకు అడ్డుకట్ట వేస్తూ.. సేవల నాణ్యత, డేటా భద్రత, ప్రభుత్వానికి రావాల్సిన రాబడి మధ్య సరైన సమతుల్యత సాధించినప్పుడే టెలికాం రంగం నిజమైన ప్రజా సంక్షేమంగా మారుతుంది. ఇదే క్రమంలో, స్టార్‌లింక్ అయినా సరే విదేశీ సంస్థ అనే నెపంతో అన్యాయంగా అడ్డుకోవడం ఎంత తప్పో, అత్యాధునిక సాంకేతిక పేరుతో ప్రత్యేక మినహాయింపులు ఇవ్వడమూ అంతే నేరం. కాబట్టి దేశీయ, విదేశీ కంపెనీలన్నింటికీ ఒకే పారదర్శక నిబంధనలు, సమాన అవకాశాలు వర్తింపజేస్తూ, పాలకుల నిర్ణయాలు కార్పొరేట్ల కనుసన్నల్లో కాక ప్రజా ప్రయోజనాల గీటురాయిపైనే రూపుదిద్దుకోవాలి.

టెలికాం రంగంలో పేరుకుపోయిన అవినీతి మూలాలను తెంచి పారదర్శకతను నెలకొల్పాలంటే స్పెక్ట్రమ్ కేటాయింపుల నుంచి బకాయిల వసూలు, అలాగే స్టార్‌లింక్, జియో, వన్‌వెబ్‌ల అనుమతుల వరకు ప్రతి నిర్ణయాన్నీ రాజకీయ, కార్పొరేట్ ఒత్తిళ్లకు లొంగకుండా బహిరంగపరచాలి. స్వతంత్ర నియంత్రణ సంస్థల ద్వారా తప్పు చేసిన ప్రతి శక్తినీ నిర్దాక్షిణ్యంగా బోనెక్కించినప్పుడే ఈ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం నిలుస్తుంది. డిజిటల్ భారత్ అంటే కేవలం కార్పొరేట్ దిగ్గజాల ఖాతాల్లో వేల కోట్ల లాభాలు నింపడం కాదు. రైతుకు సమాచారం, విద్యార్థికి జ్ఞానం, గ్రామీణ పేదవాడికి అందుబాటు ధరలో కనెక్టివిటీ దక్కినప్పుడే ఆ సాంకేతికతకు అసలైన సార్థకత చేకూరుతుంది.

గత కుంభకోణాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా, కొత్త సాంకేతిక పరిజ్ఞానం పేరుతో పాత తప్పిదాలను పునరావృతం చేస్తే నష్టపోయేది ప్రజలే. స్టార్‌లింక్ ప్రవేశించినా, మరో సంస్థ వచ్చినా, ఇప్పటికే ఉన్న దిగ్గజాలు తమ వ్యాపారాన్ని విస్తరించినా.. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే హక్కు ఎవరికీ లేదు. స్పెక్ట్రమ్ ప్రజా వనరు. దాని వినియోగం ద్వారా వచ్చే ఆదాయం దేశానికి చెందాలి. పోటీ న్యాయంగా ఉండాలి. సేవలు అందరికీ అందుబాటులో ఉండాలి. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రజల సంపదతో కార్పొరేట్లు ఎదగవచ్చు, కానీ తమ ఎదుగుదలకు ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టకూడదు.



స్వీస్‌తో కలిసి వ్యూహాత్మక అడుగులు

స్నేహ్లూ ప్రధానంగా వాణిజ్య, ఆర్థిక బంధాల బలోపేతంపైనే దృష్టిపెట్టిన ఇండియా, స్విట్జర్లాండ్ ఇప్పుడు పంథా మార్చాయి. అత్యాధునిక సాంకేతికతలు, ఆవిష్కరణలు, రక్షణ వంటి వ్యూహాత్మక రంగాల్లోనూ కలిసికట్టుగా ముందుకు సాగడంపై దృష్టిపెడుతున్నాయి. స్విట్జర్లాండ్ అధ్యక్షుడు గీ పామెలిన్ ఇటీవల మన దేశంలో పర్యటించినప్పుడు కుదిరిన కీలక ఒప్పందాలు ద్వైపాక్షిక బంధాన్ని పటిష్టం చేయనున్నాయి.అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇండియా అలీన విధానాన్ని అనుసరిస్తున్నట్టే.. స్విట్జర్లాండ్ ఎక్కువగా తటస్థ వైఖరిని అవలంబిస్తోంది. రెండూ ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యమిచ్చే దేశాలే. అంతర్జాతీయ శాంతి, సుస్థిరతలను కాంక్షించేవే. తొలి నుంచి వీటి మధ్య స్నేహపూర్వక సంబంధాలే ఉన్నాయి. ఇప్పటివరకు దిల్లీ-బెర్న్ ద్వైపాక్షిక సంబంధాలలో వాణిజ్య రంగమే కీలక పాత్ర పోషించింది. దాన్ని మరింత పదిలం చేసుకుంటూ.. పరస్పర సహకారాన్ని ఇతర రంగాలకు విస్తరింపజేసుకోవాలని అవి తలపోస్తున్నాయి. అందుకు తగ్గట్టు వేగంగా అడుగులు వేస్తున్నాయి. ఫిబ్రవరిలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ కోసం దిల్లీకి వచ్చిన స్విస్ అధ్యక్షుడు.. ఇటీవల మరోసారి ఇండియాలో పర్యటించారు. రెండుసార్లూ ప్రధాని మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉక్రెయిన్, పశ్చిమాసియా సంక్షోభాలపైనా సమాలోచనలు జరిపారు. దిల్లీతో సంబంధాల మెరుగుదలకు బెర్న్ ఇస్తున్న



ప్రాధాన్యాన్ని ఈ పర్యటనలతో ఆయన చాటిచెప్పినట్లయింది. ఈ ఏడాది జూన్‌లో మోదీ-పామెలిన్ జెనీవా వేదికగా కూడా భేటీ అయ్యారు.

నిపుణులకు అపార అవకాశాలు

ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతికతలు, మౌలిక వసతుల వంటి రంగాలను మూలస్తంభాలుగా చేసుకుని ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాలని దిల్లీబెర్న్ నిర్ణయించుకున్నాయి. ఇందులో భాగంగా వలసలు, యువ నిపుణుల మార్పిడి, రవాణా సాంకేతికతలుమౌలిక సదుపాయాలు, శాస్త్ర పరిశోధనలు, సాంకేతికతల బదిలీ అంశాలకు సంబంధించి ఇటీవల అయిదు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ప్రతిభావంతులైన భారతీయ విద్యార్థులు, నిపుణులకు స్విట్జర్లాండ్‌లో ఈ ఒప్పందాలు అపార అవకాశాలను సృష్టిస్తాయి. అయిదేళ్ల కాలానికి మల్టిపుల్ ఎంట్రీ వీసాలను అందిస్తాయి. స్విస్ నుంచి ఇండియాకు యువ నిపుణుల రాక పెరుగుతుంది. ఈ అయిదు ఒప్పందాల కార్యాచరణ ఆశించిన స్థాయిలో విజయవంతమైతే రాబోయే కొన్నేళ్లలో ద్వైపాక్షిక బంధం కొత్త రూపు సంతరించుకోవడం ఖాయం.స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టైన్ సభ్యదేశాలుగా ఉన్న ఐరోపా స్వేచ్ఛా వాణిజ్య సంఘం (ఈఎఫ్‌టీఏ)తో ఇండియాకు 'వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టెపా)' ఉంది. ఐరోపాలోని ఓ కూటమితో దిల్లీ కుదుర్చుకున్న తొలి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమిదే. నిరుడు అక్టోబరు 1 నుంచి టెపా అమల్లోకి వచ్చింది.

ఈఎఫ్‌టీఏ దేశాలు ఇండియాలో పది వేల కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టడం, రానున్న 15 ఏళ్లలో మన దేశంలో పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను కల్పించడం దీని లక్ష్యాల్లో ప్రధానమైనవి. వాటి సాధనలో పురోగతిని మోదీ, పామెలిన్ సమీక్షించారు. టెపా అమలులో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించేందుకు, పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచేందుకు ఇరు దేశాలు ఓ కమిటీని ఏర్పాటుచేశాయి.

వాణిజ్య లోటు తగ్గాలి

ఈఎఫ్‌టీఏలో ఇండియాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి స్విట్జర్లాండ్. 202425 ఆర్థిక సంవత్సరంలో ఆ దేశం నుంచి 2,180 కోట్ల డాలర్ల విలువైన ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నాం. కానీ అక్కడికి కేవలం 147 కోట్ల డాలర్ల విలువైన ఉత్పత్తులనే ఎగుమతి చేశాం.స్విస్ నుంచి మన దేశం బంగారం, విలువైన లోహాలు, యంత్రాలను ఎక్కువగా దిగుమతి చేసుకుంటోంది. 2000 ఏప్రిల్ 2025 జూన్ మధ్య స్విట్జర్లాండ్ నుంచి ఇండియాకు 1,087 కోట్ల డాలర్ల ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. మన దేశంలో 330కిపైగా స్విస్ కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వారణాసిలో రోప్‌వే నిర్మాణానికి స్విట్జర్లాండ్ సాంకేతిక సహకారం అందించింది. నోయిడా విమానాశ్రయ నిర్మాణం, కొండప్రాంతాల్లో సొరంగ ప్రాజెక్టుల విషయంలోనూ సహకరించింది. బ్యాంకింగ్, బీమా, వెల్త్ మేనేజ్‌మెంట్, అత్యాధునిక సాంకేతికతల వంటి రంగాల్లో బెర్న్ దిట్ట. దానితో దోస్తీతో ఈ రంగాల్లో దిల్లీ లాభపడొచ్చు. మూలధన ప్రవాహాన్ని పెంచుకోవచ్చు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధాల కారణంగా ప్రస్తుతం అంతర్జాతీయ వాణిజ్యం తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొంటోంది. సరఫరా గొలుసులు దెబ్బతింటున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇండియా వంటి పెద్ద మార్కెట్ ఎంత ఉపయుక్తమో, ఇండోపసిఫిక్ ప్రాంతంలో అది ఎంతటి కీలక పాత్రధారో స్విస్‌కు బాగా తెలుసు. అందుకే మనతో సుదృఢ, పరస్పర ప్రయోజనకర బంధాన్ని కోరుకుంటోంది. ఈ అవకాశాన్ని ఇండియా పూర్తిస్థాయిలో అందిపుచ్చుకోవాలి. స్విస్‌కు వ్యవసాయ, జౌళి, సముద్ర, ఇంజినీరింగ్ ఉత్పత్తులతో పాటు ఔషధ ఎగుమతులను పెంచి.. వాణిజ్య లోటును తగ్గించుకోవాలి.

సంస్కరణలూ అవసరమే!

అక్టోబర్ 21వ తేదీని 'వృత్తి నిర్వహణలో అమరులైన పోలీసువారి సంస్మరణ దినం'గా దేశమంతటా జరుపుకోవడం ఆనవాయితీ. నేడు పోలీసుల దుస్థితి చూస్తే హృదయం ద్రవిస్తుంది. ప్రాణాలను పణంగా పెట్టి ఎండనకా, వాననకా కరుడుగట్టిన దొంగలతో, నేరస్థులతో పోరాటాలు చేస్తుంటారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారినప్పుడు, జనం రాళ్లు విసిరినప్పుడు దెబ్బలు భరించాలి. ఒకవేళ ప్రాణ రక్షణలో భాగంగా కాల్పులు జరిపితే– హక్కుల సంఘాలు, పత్రికలు, న్యూస్ చానెళ్లు... పోలీసులను దుర్మార్గులుగా చిత్రీకరిస్తాయి. ఎంక్వయిరీలు, నిజ నిర్ధారణ కమిటీలు, కేసులు, శిక్షలు ఎదుర్కోక తప్పదు. అదే చట్ట వ్యతిరేక శక్తులు జరిపిన కాల్పుల్లో పోలీసులు మరణిస్తే ఇవేమీ కనబడవు, వినపడవు. విధి నిర్వహణలో ప్రాణాలు పోగొట్టుకున్న పోలీసు సిబ్బంది గురించి, వారి కుటుంబాల గురించి ప్రసారం చేయరు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అవినీతి ఉంది. కానీ అవినీతి పక్షపాతం, బంధుప్రీతి లేనిదెక్కడ? రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ట్రాన్స్‌పోర్ట్, ఎండోమెంట్స్, సేల్స్ టాక్స్, ఇన్‌కమ్ టాక్స్, ఎక్సైజ్... ఇలా ఏ డిపార్ట్‌మెంట్‌లో లేదు అవినీతి? ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు, డ్రగ్స్ నివారణలోనూ పోలీసుల పాత్ర ప్రముఖంగా నిలిచింది. ఈ విషయంలో



వారి కృషి, పట్టుదల, నిరంతర శ్రమను మనసారా అభినందించాల్సిందే!

'పోలీసులంటే ప్రభుత్వానికి కాపలాకాసే చౌకీదార్లు' అనే విధంగా ఉన్న ప్రభుత్వం మెంటాలిటీ మారేవరకు ఈ డిపార్ట్‌మెంట్‌పై నిందలు, అపనిందలు తప్పవు. అంతేకాదు, పోలీసు శాఖ సమర్థవంతంగా పనిచేయాలంటే ముందు 'పోలీసులే గవర్నమెంట్... గవర్నమెంటే పోలీసులు' అనే ప్రజా దృక్పథం మారాలి. పోలీసులంటే గవర్నమెంట్‌కు కొమ్ముకాయడానికి నియామకమైన ఫోర్స్ కాదు. వీవీఐపీలకు బాడీగార్డులుగా ఉండడానికి నిర్దేశించిన సిబ్బంది కాదు. పోలీసు వ్యవస్థ అనేది ప్రజాసైన్యం. సమాజంలో శాంతిభద్రతలు కాపాడటం దీని విధి. ప్రభుత్వాన్ని, ప్రజల ఆస్తులనూ సంరక్షించడమే ఖాకీల లక్ష్యం. ప్రభుత్వ నియంత్రణ నుంచి పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను తప్పించి, స్వతంత్ర ప్రతిపత్తి గల ఒక ప్రత్యేక వ్యవస్థగా దానిని మలచాలి. పోలీసు సిబ్బంది కూరుకుపోయి ఉన్న అమానవీయ పరిస్థితుల నుంచి వారికి విముక్తి కల్పించాలి. ప్రజలే "బెస్ట్ పోలీస్" అవార్డును ఏర్పాటు చేసి, అర్హులకు ఇచ్చే ప్రక్రియ అన్ని గ్రామాల్లో ప్రారంభం కావాలి.


సాకులు చెప్పకండి...

డిస్నీ అంటేనే ఊహకు మారుపేరు.

ప్రపంచ ప్రఖ్యాత హారర్ రచయిత స్టీఫెన్ కింగ్. మొదట్లో ఆయన రాసిన నవలలను చాలావరకు ప్రచురణ సంస్థలు తిరస్కరించాయి. విసిగిపోయి వాటిని చెత్తబుట్టలో పడేశారు కూడా. అప్పుడు ఆయన భార్య.. వాటిని తీసి మళ్లీ పంపమని ప్రోత్సహించింది. చివరికి ఒక కంపెనీ ఒప్పుకొంది. ఆ తర్వాత కింగ్ వెనుదిరిగి చూడలేదు. ఇప్పటివరకు ఆయన పుస్తకాలు ప్రపంచ వ్యాప్తంగా 35 కోట్ల కాపీలకు పైగా అమ్ముడయ్యాయి. తిరస్కారం కింగ్‌ను మరింత బలవంతుణ్ని చేసింది. జురాసిక్ పార్క్ వంటి అద్భుత చిత్రాల దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్. సినిమా అంటే విపరీతమైన అభిమానం ఉన్న ఆయన ఫిల్మ్ స్కూల్లో చేరాలని ప్రయత్నిస్తే మూడుసార్లు సీటు నిరాకరించారు. పాఠశాల విద్యలో గ్రేడ్స్ సరిగా లేవని తిప్పి పంపారు. కానీ ఆయన సినిమాని వదులుకోలేదు. సొంతంగా షార్ట్ ఫిల్మ్స్ తీస్తూ తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఈరోజు స్పీల్‌బర్గ్ హాలీవుడ్‌లోనే అత్యంత విజయవంతమైన దర్శకుడు.

వీరి ముగ్గురి జీవితాలు మనకు ఒకే సందేశాన్ని ఇస్తున్నాయి. వైఫల్యం శాశ్వతం కాదు, తిరస్కారం ముగింపు కాదు. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నాయని సాకు చెప్పి ఆగిపోతే, విజయం ఎప్పటికీ దూరంగానే ఉంటుంది. శక్తిమేరకు ప్రయత్నిస్తూ ముందుకు సాగాలి. ప్రతికూలతలే కృషికి ఇంధనంగా మారాలి. వారు మనకన్నా తెలివికలవాళ్లు, ధనవంతులు, పలుకుబడి ఉన్నవాళ్లు... ఇలాంటివన్నీ సాకులే. గెలవడానికి కావాల్సింది అవన్నీ కాదు, గెలిచితీరాలన్న పట్టుదల. ఒకసారి ఓడిపోయాక 'నా వల్ల కాదు' అనేయడం చాలా సులభం. కానీ అదే ఓటమి తర్వాత 'మళ్లీ ప్రయత్నిస్తా' అనడానికి గుండె ధైర్యం కావాలి. ఆ ధైర్యమే వారిని లెజెండ్స్‌ని చేసింది. ప్రయత్నిస్తే ఎవరినైనా విజేతల్ని చేస్తుంది.

రికామీగా తిరుగుతున్న నిరుద్యోగ యువకుణ్ని 'ఉద్యోగం ఎందుకు రాలేదు?' అని అడిగితే 'అవకాశాలు లేవు' అంటాడు. వ్యాపారం చేసి నష్టపోయినవారు 'మార్కెట్ బాగాలేదు' అంటారు. పరీక్ష తప్పిన విద్యార్థి 'పేపర్ టఫ్‌గా వచ్చింది' అని చెబుతాడు. ప్రతి ఓటమికీ ఒక సాకు, ప్రతి వైఫల్యానికీ ఒక కారణం మన దగ్గర సిద్ధంగా ఉంటుంది.నా బతుకింతే, ఇంతకు మించి నావల్ల కాదు... లాంటి మాటలను మనం తరచూ ఎక్కడో ఒకచోట వింటూనే ఉంటాం. సాధారణ మనిషి పరిస్థితిని చూసి భయపడతాడు, గొప్ప వ్యక్తి అదే పరిస్థితిని సవాలుగా తీసుకుంటాడు. పిల్లలందరికీ ఇష్టమైన మిక్కీ మౌస్ సృష్టికర్త వాల్ట్ డిస్నీ. ఆయన ఒకప్పుడు వార్తాపత్రికలో చిన్న ఉద్యోగం చేసేవారు. 'నీకు క్రియేటివిటీ లేదు' అంటూ అక్కడ ఉద్యోగం నుంచి తీసేశారు. అలా ఉద్యోగం పోగొట్టుకున్న వ్యక్తే తన ఊహలకు



రెక్కలు తొడిగి.. ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన యానిమేషన్ సామ్రాజ్యాన్ని నిర్మించారంటే నమ్మగలరా? ఈ రోజు

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

నవంబర్ 26 న తిరుమల రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

- ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రదేశాలలో భద్రతా చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పి తో కలసి ఏ ఎస్ ఎల్ నిర్వహించిన జిల్లా కలెక్టర్
- అధికార యంత్రాంగం సమన్వయంతో విజయవంతం చేయండి
- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి, నవంబర్ 24:అనంత జనశక్తి న్యూస్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నవంబర్ 26న తిరుమల పర్యటనకు రానున్నారని, అధికార యంత్రాంగం సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు.మంగళవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లోని విసి హాల్ నందు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ముందస్తు ఏర్పాట్ల పై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రదేశాలలో జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడుతో కలసి ఎ ఎస్ ఎల్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి పర్యటనలో భాగంగా నవంబర్ 26న గురువారం ఉదయం 10 గం.లకు తిరుపతి పట్టణం లోని అగ్రికల్చర్ యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుంటారన్నారు. అనంతరం ముఖ్యమంత్రి ఉదయం 10.45 గం.లకు తిరుమల గాయత్రి గెస్ట్‌హౌస్ చేరుకుని, 11.10 గం.లకు శ్రీ వారి దర్శనానికి వెళతారన్నారు. శ్రీవారి దర్శనం అనంతరం మధ్యాహ్నం 12.45 గం.లకు తిరుమల నుండి బయల్దేరి తిరుపతి అగ్రికల్చర్ యూనివర్సిటీ చేరుకుని మధ్యాహ్నం 1.30 గం.లకు హెలికాప్టర్ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం బయల్దేరి వెళ్లనున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా హెలిప్యాడ్ ఏర్పాటు, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, తదితర ఏర్పాట్ల పై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో తిరుపతి ఆర్ డి ఓ రామ్మోహన్, అడిషనల్ ఎస్ పి లు రామకృష్ణ, శ్రీనివాస రావు, డి ఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణనాయక్, ఆర్ అండ్ బి ఎస్ ఈ రాజా నాయక్, జిల్లా రవాణా అధికారి మురళి మోహన్, డీఎస్పీ లు, సీఐలు, ఎస్సైలు మరియు భద్రతా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఉద్యోగులపై ఒత్తిళ్లు తగవు

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సాకే వినయ్ కుమార్
- ఉద్యోగుల హక్కులను గౌరవించాలి
- న్నికల్లో పోటీ చేస్తున్న సిబ్బందిపై రాజీనామాల ఒత్తిడి ఆపాలి

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి , నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్:



బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందిపై రాజీనామాల ఒత్తిడి, వివక్ష ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని బీఎస్పీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు సాకే వినయ్ కుమార్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడం ప్రజాస్వామ్య హక్కు అని, ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఉద్యోగులపై అనవసర ఒత్తిళ్లు తగవని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సంస్థలో సేవలందిస్తున్న సీనియర్ ఉద్యోగులపై పని భారం పెంచి ఉద్యోగం వీడే పరిస్థితులు కల్పిస్తున్నారనే ఆరోపణలపై ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మంచో ఫెరర్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని విచారణ జరిపించాలని కోరారు. ఎన్నికల రోజున సిబ్బందికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని, అత్యవసర సేవలకు అంతరాయం లేకుండా షిఫ్టుల వారీగా సెలవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.
ఉద్యోగులపై టీడీపీ నాయకుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయనే ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దళిత, గిరిజన ఉద్యోగులకు సమాన గౌరవం కల్పిస్తూ ఎలాంటి వివక్షకు తావులేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని సాకే వినయ్ కుమార్ కోరారు.

రాప్తాడులో ఘనంగా కడ్లే గౌరమ్మ ఉత్సవాలు ప్రారంభం



- 24 నుంచి 28వ తేదీ వరకు ప్రత్యేక పూజలు, ఉత్సవాలు

రాప్తాడు మండల కేంద్రంలో కడ్లే గౌరమ్మ ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ముందుగా రాప్తాడులోని పండమేరు వాగు నుంచి డోలు, దప్పులు, మంగళ వాయిద్యాల నడుమ గంగను తీసుకొచ్చి రామేశ్వరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 9 గంటలకు కడ్లే గౌరమ్మ, గౌరీదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు నిర్వహించారు. గౌరమ్మకు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అర్చకులు కోరారు.

అయ్యప్పస్వామి దేవాలయం లో కార్తీక పౌర్ణమి పూజలు

యాడికి, నవంబర్ 24,అనంత జనశక్తి న్యూస్ :



1మండల కేంద్రంలోని బుగ్గరోడ్డు లో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం లో మంగళవారం కార్తీక పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీ అయ్యప్పస్వామి కి, శివుని కి పంచామృత అభిషేకం చేసి, వివిధ పూలమాలలతో అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ అయ్య ప్పస్వామి పడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వా మి భక్తి పాటలతోను,ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప అనే నామం మారు మ్రోగింది . అయ్యప్పస్వామి కి మహా మంగళహారతిని సమర్పించారు. కార్తీక దీపంను వెలిగించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందచేసి, అన్న దానం చేశారు.ఈ కార్యక్రమంలో గురుస్వాములు హరినాథ్ స్వామి,చిట్టి స్వామి,ఆలయ అధ్యక్షుడు నాగరాజు, పూజారి నాగరాజు, భక్తులు పాల్గోన్నారు.

ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులకు ట్రాక్‌సూట్లు పంపిణీ

-పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యం: మంజునాథ్ రెడ్డి

చిక్కబళ్లాపురం:
నవంబర్ 24 అనంత జనశక్తి న్యూస్



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో సమానంగా విద్య, అవకాశాలు, సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా ట్రాక్‌సూట్లు పంపిణీ చేశారు. చిక్కబళ్లాపురం తాలూకా దిన్నెహొసహళ్లి గ్రామంలోని ప్రభుత్వ క□□□□ ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు.చిక్కబళ్లాపురం నియోజకవర్గానికి చెందిన సామాజిక సేవకుడు, భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సందీప్ బి. రెడ్డి ఆధ్వర్యంలో విద్య, వైద్యం, ఆలయాల అభివృద్ధి తదితర రంగాల్లో పలు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ట్రాక్‌సూట్లు అందజేసి వారి విద్యా, క్రీడా కార్యకలాపాలకు ప్రోత్సాహం అందించారు.ఈ సందర్భంగా సందీప్ రెడ్డి అభిమానుల సంఘం నాయకుడు మంజునాథ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యకు ప్రోత్సాహం అందించడం ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం, అభ్యసన ఆసక్తి పెంపొందించవచ్చన్నారు. సందీప్ బి. రెడ్డి విద్య, వైద్యం, ఆలయాల అభివృద్ధి వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల ఆదరణ పొందుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు.ట్రస్ట్ మేనేజర్ డి. మోహన్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లోనూ అపారమైన ప్రతిభ, సామర్థ్యం ఉన్నాయని తెలిపారు. వారికి తగిన ప్రోత్సాహం, అవసరమైన సౌకర్యాలు కల్పిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు. పిల్లలకు నేడు అందించే చిన్నపాటి ప్రోత్సాహమే రేపటి పెద్ద విజయాలకు పునాది అవుతుందని అన్నారు. రానున్న రోజుల్లోనూ విద్యాభివృద్ధికి దోహదపడే మరిన్ని సేవా కార్యక్రమాలను ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడతామని వెల్లడించారు.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, దాతలు, పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు కూడా భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, పాఠశాల అభివృద్ధి కమిటీ (ఎస్‌డీఎంసీ) అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, సందీప్ బి. రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలు

(మొదటి పేజీ తరువాయి)

ఏడీజీపీ మధుసూదన్ రెడ్డి సైతం ఈ సమీక్షలో పాల్గొన్నారు.

19శాతం వరకూ ఏకగ్రీవాలు జరిగాయి..

ఆయా గ్రామపంచాయతీలు ఏకగ్రీవాలు అయ్యాయని అనిల్ చంద్రా పునేఠా తెలిపారు. ఆశించినంతగా ఏకగ్రీవాలు జరగలేదని చెప్పారు. 19శాతం వరకూ ఇవి జరిగాయని వెల్లడించారు. బలవంతంగా ఏకగ్రీవాలు జరగకూడదని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల కోసం పోలీసు బలగాలు అదనంగా విధుల్లో ఉంటాయని చెప్పుకొచ్చారు. డీజీపీ కార్యాలయం నుంచి సైతం బలగాలు విధుల్లో పాల్గొంటాయని అన్నారు.పల్నాడు తో పాటు పలు జిల్లాల్లో సమస్యలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనంగా స్పెషల్ పార్టీస్ ఉంటాయని చెప్పుకొచ్చారు. గుంటూరు జిల్లాలో ఒక అభ్యర్థిని నాలుగుసార్లు పోటీ చేయకుండా కొంతమంది అడ్డుకున్నారని అన్నారు. తమకు వచ్చిన ఫిర్యాదులను ఏపీ డీజీపీకి పంపించామని.. వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటున్నారని అనిల్ చంద్రా పునేఠా పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ముగిసిపోగా.. ఇప్పుడు పంచాయతీ ఎన్నికలకు సిద్ధం అవుతోంది ఎన్నికల సంఘం.. మూడు దశల్లో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. ఎన్నికల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి నట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏడీజీపీ మధుసూధన్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలు

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేసినట్లు పునేఠా తెలిపారు. అవసరమైన చోట్ల అదనంగా స్టైకింగ్ ఫోర్సెస్‌ను కూడా అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఏకగ్రీవాల నేపథ్యంలో కూడా భద్రతా బలగాలను అదనంగా మోహరిస్తున్నట్లు వెల్లడించారు. డీజీపీ కార్యాలయం నుంచి కూడా పోలీసు బలగాలను పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

పల్నాడు దిగువ జిల్లాల్లో ఎక్కువ సమస్యలు

పల్నాడు నుంచి దిగువ ప్రాంతాల్లోని జిల్లాల్లో ఎన్నికలకు సంబంధించి సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు ఎస్ఈసీ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.గుంటూరు జిల్లాలో ఒక అభ్యర్థిని నాలుగుసార్లు అడ్డుకున్న ఘటన తమ దృష్టికి వచ్చిందని వెల్లడించారు. ఎన్నికలకు సంబంధించి అందిన ప్రతి ఫిర్యాదును డీజీపీకి పంపించామని, వాటిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

బలవంతపు ఏకగ్రీవాలకు తావులేదు

గ్రామపంచాయతీ ఎన్నికల్లో బలవంతంగా ఏకగ్రీవాలు జరగకూడదని స్పష్టంగా ఆదేశించినట్లు అనిల్ చంద్ర పునేఠా చెప్పారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేసుకునేలా చూడాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఒత్తిళ్లు, అడ్డంకులు ఉండకూడదని స్పష్టం చేశారు. ఇక, మొదటి దశ ఎన్నికల్లో 15 నుంచి 20 శాతం వరకు ఏకగ్రీవాలు జరుగుతాయని అంచనా వేసినట్లు ఎస్ఈసీ తెలిపారు. వాస్తవంగా దాదాపు 19 శాతం ఏకగ్రీవాలు జరిగినట్లు వెల్లడించారు.తాము ఆశించిన స్థాయిలో ఏకగ్రీవాలు జరగలేదని పేర్కొన్నారు. మొత్తంగా మూడు దశల గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా..

కలెక్టర్లు, ఎస్పీల వరకు అందరికీ లీగల్ నోటీసులు!

అమరావతి, నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలతో పాటు మిగిలిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వైసీపీ తీవ్ర స్థాయిలో న్యాయపోరాటానికి దిగింది. సుప్రీంకోర్టు ఆదేశాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాల్సిందేనంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్, డీజీపీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మొదలుకొని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, ఎన్నికల అధికారుల వరకు అందరికీ లీగల్ నోటీసులు పంపింది. వైసీపీ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది మెహఫూజ్ నజ్కీ ఈ నోటీసులను జారీ చేశారు. రూల్స్ విషయంలో ఏమాత్రం తేడా జరిగినా మరోసారి నోటీసులు ఇవ్వబోమని, బాధ్యులైన అధికారులపై వ్యక్తిగత హోదాలో కోర్టు ధిక్కరణ చర్యల కోసం నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేయడంతో అధికార యంత్రాంగంలో కలకలం మొదలైంది.

గత అక్టోబర్ 27, 2026న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్థానిక సంస్థల ఎన్నికల్లో తు.చ. తప్పకుండా అమలు చేయాలని వైసీపీ తన నోటీసుల్లో తేల్చిచెప్పింది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 16న ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాలను ఇతర స్థానిక సంస్థల ఎన్నికలకూ వర్తింపజేయాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 144 ప్రకారం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవడం ప్రతి అధికారి బాధ్యత అని పేర్కొంది. అన్ని రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు స్వేచ్ఛగా, నిష్పక్షపాత వాతావరణంలో పోటీ చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేసింది.

పల్నాడు, కడప, తిరుపతి, శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల్లో వైసీపీ బలపరిచిన అభ్యర్థులపై దాడులు, నిర్బంధాలు, నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, బలవంతంగా ఉపసంహరింపజేయడం వంటి ఘటనలు జరిగాయని, వీటిపై ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందాయని నోటీసులో ప్రస్తావించారు. నామినేషన్లకు ఆటంకాలు కలిగించిన ఘటనలపై ఈసీ విచారణ జరిపి, అవసరమైతే నామినేషన్ల గడువును పొడిగించాలి. స్థానికంగా అడ్డంకులు ఉన్నచోట జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల వద్ద నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించాలి. నామినేషన్లు వేయకుండా అడ్డుకున్న సందర్భాల్లో బాధిత అభ్యర్థులకు ఎన్నికల పిటిషన్లు దాఖలు చేసే హక్కు ఉంది. అభ్యర్థులు ఎలాంటి భయం లేకుండా నామినేషన్లు వేసేలా తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం, ఎన్నికల ప్రక్రియ ఆసాంతం శాంతిభద్రతలను కాపాడటం పూర్తిగా డీజీపీ బాధ్యత అని స్పష్టం చేశారు.

ఎన్నికల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరగాలంటే ప్రతి అడుగు రికార్డు కావాలని వైసీపీ డిమాండ్ చేసింది. నామినేషన్ కేంద్రాలు, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు లేదా వీడియో రికార్డింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొంది. ముఖ్యంగా పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ జరిగిన రోజే, అదే కేంద్రంలో ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన జరుగుతున్నందున వీడియో రికార్డింగ్ ఒక్క క్షణం కూడా ఆగకూడదని తెలిపింది. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి, చివరికి బ్యాలెట్ పత్రాలు, ఎన్నికల రికార్డులను సీల్ చేసేంత వరకు నిరంతరాయంగా రికార్డింగ్ చేయాలని స్పష్టం చేసింది.

రికార్డు చేసిన వీడియో ఫుటేజీని ఎన్నికల పిటిషన్ల దాఖలుకు నిర్దేశించిన గడువు ముగిసే వరకు, ఒకవేళ పిటిషన్లు దాఖలైతే వాటిపై తుది తీర్పు వెలువడేంత వరకు భద్రపరచాలని వైసీపీ కోరింది. ఎన్నికల ట్రిబ్యునల్ కోరినప్పుడు, ఎన్నికల పిటిషన్‌లోని పక్షాలు దరఖాస్తు చేసినప్పుడు ఆ వీడియో ఫుటేజీని అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొంది. ఒకవేళ వీడియో రికార్డింగ్ చేయకపోయినా, ఫుటేజీని తొలగించినా, ధ్వంసం చేసినా, భద్రపరచకపోయినా దాన్ని కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. వీడియో ఫుటేజీ మాయమైనా, ధ్వంసమైనా ఆ విషయాలను బాధిత అభ్యర్థులు దాఖలు చేసే ఎన్నికల పిటిషన్లలో బలంగా ప్రస్తావిస్తామని వైసీపీ తెలిపింది. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే మరోసారి నోటీసులు ఇవ్వకుండానే నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని, తదుపరి జరిగే పరిణామాలకు సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. వీటితో పాటు వైసీపీకి, ఆ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు చట్టపరంగా అందుబాటులో ఉన్న ఇతర అన్ని న్యాయపరమైన చర్యలు తీసుకునే హక్కులను కొనసాగిస్తామని తెల్చిచెప్పింది.

భోగాపురం హైవేపై విషాదం

(మొదటి పేజీ తరువాయి)

విశాఖ జిల్లా భీమిలి, తగరపువలస ప్రాంతాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు కారులో శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీముఖలింగం ఆలయానికి వెళ్లారు. అక్కడ స్వామివారి దర్శనం పూర్తి చేసుకుని తిరిగి స్వస్థలాలకు బయలుదేరారు. మార్గమధ్యలో విజయనగరం జిల్లా భోగాపురం హైవేపై సుందరపేట వద్దకు రాగానే, రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఓ ట్యాంకర్‌ను వీరి కారు అత్యంత వేగంతో ఢీకొట్టింది.

ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం నుజ్జునుజ్జయి ట్యాంకర్ కిందకు చొచ్చుకుపోయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారిలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. తీవ్ర గాయాలతో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న మరొకరిని స్థానికులు, పోలీసులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశారు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది.

పోలీసులు మృతదేహాలను బయటకు తీసి, వారి వద్ద ఉన్న ఆధారాల ద్వారా వివరాలు సేకరించారు. మృతుల్లో రెండు జంటలు ఉండటం అందరినీ కంటతడి పెట్టిస్తోంది. భీమిలి వాసులు కొండా సూరిబాబుతోపాటుగా బొర్రా సతీశ్, ఆయన భార్య శ్రుతి. తగరపువలస వాసులు వాకలపూడి శ్రీను, ఆయన భార్య కుసుమరంజని మృతి చెందారు. ఒకేసారి ఐదుగురు మృతి చెందడంతో భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో ఆస్పత్రి ఆవరణ దద్దరిల్లింది.

ఈ ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే హోంమంత్రి అనిత విజయనగరం జిల్లా ఉన్నతాధికారులు, పోలీసులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. మృతదేహాల పోస్టుమార్టం ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సైతం మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సమాచారం అందుకున్న వెంటనే భోగాపురం పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో, క్రేన్ సాయంతో ధ్వంసమైన కారును పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

జాతీయ రహదారులపై ఎలాంటి హెచ్చరిక సూచికలు లేకుండా భారీ వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపివేయడం వల్లే ఇలాంటి ప్రాణాంతక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి లేదా వేగంగా ప్రయాణించే సమయంలో ఆగి ఉన్న వాహనాలు కనిపించక డ్రైవర్లు అదుపుతప్పుతున్నారని, హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఇలాంటి పార్కింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 26 సీట్లు ఇవ్వడానికి ఓకే

ఎస్పీ ఎంపీ రాజీవ్ రాయ్

చ్చే ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 26 సీట్లు ఇస్తామని సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ) ప్రతిపాదనలు చేసిందని ఆ పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ మంగళవారం వెల్లడించారు. యూపీ ఎన్నికల నేపథ్యంలో సీట్ల కేటాయింపుపై కాంగ్రెస్, ఎస్పీ నడుమ వాడివేడిగా చర్చలు సాగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాజీవ్ రాయ్ మీడియాతో మాట్లాడారు. 'సీట్ల పంపకంపై చర్చలు సాగుతున్నాయి. మేము కాంగ్రెస్ పార్టీకి 26 సీట్లు కేటాయించాం' అని ఆయన వివరించారు. అయితే సీట్ల సర్దుబాటు ఇంకా ఓ కొలిక్కి రాలేదని సమాచారం.

సోమవారం న్యూఢిల్లీలో జరిగిన మొదటి విడత చర్చల్లో రెండు పార్టీలూ ఏకాభిప్రాయానికి రాలేదు. దీంతో ఇవాళ రెండో విడత చర్చలు జరగనున్నాయి. కాగా మునుపు తమకు 181 సీట్లు కావాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు కొంచెం వెనక్కు తగ్గినట్టు తెలుస్తోంది. వంద నుంచి రెండొందల సీట్ల వరకూ ఇస్తే చాలని ఆ పార్టీ అంటోందని మీడియా వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు 26 సీట్లు ఇచ్చేందుకు ఎస్పీ సుముఖత వ్యక్తం చేస్తోందని రాజీవ్ రాయ్ తెలిపారు. రెండో విడత చర్చల అనంతరం సీట్ల కేటాయింపుపై స్పష్టత రానుంది.

లోక్‌సభ ప్రతిపక్షనేతగా రాహుల్ గాంధీ స్థానాన్ని కారణంగా చూపుతూ కాంగ్రెస్ భారీ సంఖ్యలో సీట్లను ఆశిస్తోందని పలువురు విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే తమ అభ్యర్థులు బరిలోకి దిగాలనుకుంటున్న నియోజకవర్గాల జాబితాను ఆ పార్టీ రూపొందించింది. కాగా 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలూ కలిసి పోటీ చేస్తే ఘోర పరాజయం ఎదురైంది. ఆ ఎన్నికల్లో 107 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ కేవలం ఏడు సీట్లే గెలుచుకుంది. అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీ 47 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. 2022లో విడిగా పోటీ చేసిన ఈ పార్టీలు.. 2027 ఎన్నికల కోసం మళ్లీ జతకట్టాయి. ఈసారి ఎలాగైనా నెగ్గి తీరాలని వ్యూహాలు రచిస్తున్నాయి.



రోడ్డు ప్రమాదంలో కేసీఆర్ అటెండర్ మృతి.. మరో యువకుడు కన్నుమూత

మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని కేసీఆర్ భరోసా

రాజన్న సిరిసిల్ల:నవంబర్ 24,అనంత జనశక్తి న్యూస్



రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్ద అటెండర్‌గా పనిచేస్తున్న కస్తూరి మహేందర్ రెడ్డి అలియాస్ మణికుమార్ రెడ్డి మృతి చెందారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో యువకుడు భరత్ సైతం చికిత్స పొందుతూ మృతి చెందాడు.ముస్తాబాద్ మండలం బందనకల్ గ్రామ సమీపంలోని హనుమాన్ నగర్ చౌరస్తా వద్ద వెంకయ్యకుంట సమీపంలో రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌పై ప్రయాణిస్తున్న యువకులను ఉనుక లారీ ఢీకొట్టడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో మణికుమార్ రెడ్డి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, తీవ్రంగా గాయపడిన భరత్‌ను ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ రాత్రి 2 గంటల సమయంలో భరత్ కూడా మృతి చెందాడు.మణికుమార్ రెడ్డి మృతి వార్త తెలుసుకున్న కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే ముస్తాబాద్ మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావుతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పుస్తక పఠనాసక్తిని పెంపొందించడంలో జర్నలిస్టులు, రచయితల పాత్ర కీలకం

- యువతలో చదివే అలవాటును పెంచేలా మరిన్ని మంచి రచనలు రావాలి: జ్యోత్స్న

హైదరాబాద్, నవంబర్ 24:అనంత జనశక్తి న్యూస్



యువతలో పుస్తక పఠనాసక్తిని పెంపొందించడంలో జర్నలిస్టులు, రచయితలు కీలక పాత్ర పోషించాలని సీనియర్ జర్నలిస్టు జ్యోత్స్న ఆకాంక్షించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ మాధ్యమాల ప్రభావంతో పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గుతున్న నేపథ్యంలో యువతను తిరిగి పుస్తకాల వైపు మళ్లించేలా నాణ్యమైన రచనలు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.మంగళవారం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఉన్న సీఆర్ ఫౌండేషన్‌లో నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్ (లైబ్రరీ) ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జ్యోత్స్నను యాత్రలోకం ట్రావెల్ మ్యాగజైన్ సంపాదకుడు టీ. అనిల్ కుమార్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ మాజీ సభ్యుడు, సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావుతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మ్యాగజైన్ తాజా సంచికను ఆమెకు అందజేశారు.ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలు, సంస్కృతి, సంప్రదాయాలను తెలుగు పాఠకులకు పరిచయం చేయడమే యాత్రలోకం మ్యాగజైన్ ప్రధాన ఉద్దేశమని వివరించారు. నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్ లైబ్రరీకి ప్రతినెలా మ్యాగజైన్‌ను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. గ్రంథాలయాల ద్వారా పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉంచడం వల్ల పాఠకుల్లో విజ్ఞానం, పఠనాసక్తి పెరుగుతాయని అన్నారు.జ్యోత్స్న మాట్లాడుతూ, గతంలో యువతలో పుస్తకాలు చదివే అలవాటు విస్తృతంగా ఉండేదని, ప్రస్తుతం డిజిటల్ మాధ్యమాల ప్రభావంతో ఆ ఆసక్తి క్రమంగా తగ్గుతోందని అభిప్రాయపడ్డారు. పుస్తక పఠనం వ్యక్తి ఆలోచనా పరిధిని విస్తృతం చేయడంతో పాటు చరిత్ర,సంస్కృతి, సమాజం, వివిధ రంగాలపై సమగ్ర అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు. యువతలో చదివే అలవాటును పెంపొందించేందుకు జర్నలిస్టులు, రచయితలు మరిన్ని నాణ్యమైన రచనలు చేయాలని సూచించారు. గ్రంథాలయాలకు విలువైన సమాచారం అందించే పత్రికలు, మ్యాగజైన్లు చేరడం అభినందనీయమన్నారు.అనంతరం సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు, జ్యోత్స్నతో కలిసి దివంగత సీ.రాఘవాచారితో తమకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆనాటి జర్నలిజం రంగంలోని అనుభవాలు, మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాత్రికేయ రంగానికి రాఘవాచారి అందించిన సేవలు, ఆయన పాటించిన విలువలు, సమాజం పట్ల చూపిన నిబద్ధతను గుర్తుచేశారు.ఈ ఆత్మీయ కలయికలో పాత జర్నలిజం జ్ఞాపకాలతో పాటు ప్రస్తుత పాత్రికేయ రంగం, పుస్తక పఠనం, గ్రంథాలయాల ప్రాధాన్యతపై చర్చించారు. గ్రంథాలయానికి యాత్రలోకం మ్యాగజైన్‌ను ప్రతినెలా అందించాలన్న నిర్ణయం ద్వారా పాఠకులకు పర్యాటక, చారిత్రక విజ్ఞానాన్ని చేరువ చేయనున్నట్లు తెలిపారు.

మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



'గత్తర' సినిమా షూటింగ్‌ను క్లాప్ కొట్టి ప్రారంభించిన ఎమ్మెల్యే

కల్వకుర్తి నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మైసిగండి శ్రీ మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 26న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొననున్న బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలనకు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, సహచర ఎమ్మెల్యే రాజేష్ రెడ్డితో కలిసి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో మైసిగండి ఆలయాన్ని సందర్శించారు.అనంతరం ఆమనగల్ పట్టణంలో ప్రారంభం కానున్న 'గత్తర' సినిమా షూటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిత్ర బృందాన్ని కలిసి క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి, సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- పీఏసీఎస్ నూతన చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

భూత్పూర్:నవంబర్ 24 అనంత జనశక్తి న్యూస్



రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) అన్నారు. భూత్పూర్ మున్సిపాలిటీలోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నూతనంగా నియమితులైన భూత్పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన చైర్మన్ మూడవత్ హర్యా నాయక్‌తో పాటు డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసి లక్షలాది రైతు కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. సాగు ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీలు అందించడంతో పాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా యంత్రాలు, పరికరాలు, విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను ప్రతి రైతుకు వివరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, సహకార సంఘాల నాయకులపై ఉందన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్లు, డైరెక్టర్లు పదవులను హోదాలుగా కాకుండా రైతులకు సేవ చేసే బాధ్యతగా భావించాలని సూచించారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రభుత్వ సబ్సిడీలు అర్హులైన రైతులందరికీ అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.పార్టీ కష్టకాలంలోనూ నమ్మకంతో పని చేసిన నాయకులు, కార్యకర్తలను గుర్తించి పదవులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భూత్పూర్ పీఏసీఎస్ చైర్మన్‌గా గిరిజన నాయకుడు హర్యా నాయక్‌ను నియమించామని, ఆయన పార్టీ కోసం ఎన్నో కష్టాలు ఎదుర్కొని పనిచేశారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన సమయంలో గుర్తింపు, పదవులు లభిస్తాయని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ వైద్య సదుపాయం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లూరులో కూటమి జోరు



- అండగా నిలవండి.అల్లూరును అభివృద్ధి పథంలో నడిపిస్తా: మంత్రి నారాయణ

అల్లూరు:నవంబర్ 24:అనంత జనశక్తి న్యూస్

అల్లూరు నగర పంచాయతీ ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ భారీ ర్యాలీ నిర్వహించారు. కూటమి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్ షోకు మద్దతు తెలిపారు. చైర్మన్ అభ్యర్థి తోటకూర సునీల్ కుమార్‌తో పాటు కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. 2024 ఎన్నికల కంటే ప్రస్తుతం ప్రజాదరణ మరింత పెరిగిందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు.దివాలా తీసిన రాష్ట్రాన్ని కేంద్రం సహకారంతో తిరిగి గాడిలో పెట్టిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.50 వేల కోట్ల నిధులు కేటాయించడం శుభపరిణామమన్నారు. నెల్లూరు జిల్లాలో గూడూరు, కావలి, అల్లూరు ఎన్నికల్లో కూటమి తన సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. అల్లూరు ప్రజలు ఆశీర్వదిస్తే నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించి చూపిస్తానని స్పష్టం చేశారు.ఈ రాలీలో నెల్లూరు నగర మేయర్ రూప్ కుమార్ యాదవ్,అల్లూరు మండల టీడీపీ నేత శ్రీనివాసులు రెడ్డి,జనసేన నేత సుకుమార్ రెడ్డి,రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుకుమార్ రెడ్డి,మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి,పలువురు నెల్లూరు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ నూతన సభ్యుల ఇండక్షన్, కార్యాచరణ సమావేశం



హైదరాబాద్, నవంబర్ 24 (అనంత జనశక్తి):

లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ ఆధ్వర్యంలో నూతన సభ్యుల ఇండక్షన్ మరియు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక సమావేశం చంపాపేట్‌లోని ఎన్ విలేజ్ హోటల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్లు లయన్ డాక్టర్ రాజగోపాల్ రెడ్డి, లయన్ బండారు ప్రభాకర్, మాజీ ప్రెసిడెంట్ లయన్ సుధాకర్ రెడ్డి హాజరై సేవా కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ హన్మంత్ రెడ్డి, డెర్మటాలజిస్ట్ డాక్టర్ మేధిని రెడ్డి, దంత వైద్య నిపుణులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, హైదరాబాద్ హోమియో క్లినిక్ వైద్యులు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, వ్యాపారవేత్త లింగేష్ గుప్తా క్లబ్‌లో నూతన సభ్యులుగా చేరారు. భవిష్యత్తులో పేదలకు ఉచిత మెడికల్ క్యాంపుల నిర్వహణ, కామధేను అన్నదాన కార్యక్రమ విస్తరణ, ప్రతి అమావాస్యకు వెయ్యి మందికి అన్నదానం చేసేలా సభ్యులు తీర్మానించారు.అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ ప్రెసిడెంట్ లయన్ వెంకటేశ్వర్ రెడ్డి (ఎస్ ఎన్ కార్ డెక్కర్స్ యాజమాని చంపాపేట్) మాట్లాడుతూ, మన దక్కన్ క్లబ్‌లో ఉన్నత విద్యావంతులైన వైద్య నిపుణులు, ప్రముఖ వ్యాపారవేత్తలు మరియు సమాజ సేవ పట్ల ఆసక్తి కలిగిన వ్యక్తులు సభ్యులుగా ఉండటం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. సమాజానికి సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. సభ్యులందరి సమిష్టి సహకారం, ప్రోత్సాహం మరియు అంకిత భావంతో భవిష్యత్తులో మరెన్నో అర్థవంతమైన సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ మనీషా సింగ్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి శివాలయంలో ప్రత్యేక పూజలు..

- తరలివచ్చిన భక్తులు..

గాండ్లపెంట, నవంబర్, 24, అనంత జనశక్తి న్యూస్,

మండల శివాలయంలో మంగళవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఆలయ పూజారి మురళి స్వామి ఆధ్వర్యంలో శివుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయానికి స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో సందడిగా మారింది. ఈ సందర్భంగా ఆలయ పూజారి మురళి స్వామి మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి సందర్భంగా శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.



దీక్షా మార్గంలో దాతృత్వ వెలుగు.... ఆరు రోజులుగా అన్నప్రసాద సేవ....!!

-మాలధారులకు భోజన సదుపాయం కల్పిస్తూ ముందుకు సాగుతున్న డోలా దంపతులు

-ఆలయానికి చేరుతున్న స్వాములకు ఆప్యాయతతో ఆతిథ్యం

-సేవా కార్యక్రమానికి రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల ఆదరణ

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి

, నవంబర్ 24, అనంత జనశక్తి న్యూస్:

ధర్మపరం పట్టణంలో మాలధారణ చేపట్టి ఆధ్యాత్మిక దీక్షలో ఉన్న స్వాములకు భోజన సౌకర్యాన్ని కల్పిస్తూ 35వ వార్డు కౌన్సిలర్ డోలా రాజారెడ్డి, ఆయన సతీమణి డోలా ఓబులమ్మ చేపట్టిన అన్నప్రసాద కార్యక్రమం ఆరో రోజుకు చేరుకుంది. పుట్టపర్తి రోడ్డు సమీపంలోని శిరిడి సాయిబాబా దేవాలయం వద్ద మంగళవారం భక్తులకు భోజనాన్ని అందించారు. వరుసగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంతో దీక్షలో ఉన్న స్వాములకు ఒక పూట భోజనానికి ఇబ్బంది లేకుండా చేయాలనే దంపతుల సంకల్పం ప్రతిఫలిస్తోంది. మాలధారణలో ఉన్న భక్తులు నిత్యం ఆలయానికి వచ్చి పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో వారికి అవసరమైన సమయంలో భోజనం అందించాలనే ఆలోచనతో డోలా దంపతులు ఈ సేవను ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభించిన తొలి రోజుతో పోలిస్తే ప్రస్తుతం భక్తుల స్పందన కూడా పెరుగుతోంది. ఆలయానికి వచ్చిన స్వాములకు ముందుగా భోజన ఏర్పాట్లు చేసి, వడ్డించే విధానంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

అన్నదాన కార్యక్రమం నిర్వహణలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు కూడా తమ వంతు సహకారం అందిస్తూ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహిస్తున్నారు. భోజనం స్వీకరించిన అనంతరం మాలధార భక్తులు నిర్వాహకులను అభినందిస్తూ ఆశీర్వదించారు. ఆధ్యాత్మిక విశ్వాసంతో దీక్ష చేపట్టిన వారికి ఆహారాన్ని సమకూర్చడం ద్వారా డోలా దంపతులు తమ సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నారని పలువురు తెలిపారు.

ప్రజా జీవితంలో కొనసాగుతున్న వ్యక్తులు కేవలం రాజకీయ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల అవసరాలను గుర్తించి సామాజిక సేవలోనూ భాగస్వాములు కావడం మంచి పరిణామమని స్థానికులు పేర్కొన్నారు. ముఖ్యంగా దీక్షా కాలంలో నియమ నిష్ఠలతో ఉండే భక్తులకు భోజన సౌకర్యం కల్పించడం వల్ల వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో దాతృత్వ భావనను మరింత బలపరుస్తాయని తెలిపారు.డోలా రాజారెడ్డి, డోలా ఓబులమ్మ మాట్లాడుతూ మాలధారణలో ఉన్న స్వాములకు తమవంతుగా ఏదైనా చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. భక్తుల నుంచి లభిస్తున్న ఆదరణ తమకు సంతోషాన్ని కలిగిస్తోందని, వీలైనంత వరకు కార్యక్రమాన్ని కొనసాగించేందుకు కృషి చేస్తామని చెప్పారు. భక్తుల సంతృప్తి తమకు నిజమైన ప్రోత్సాహమని పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో ఆరు రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం భక్తి విశ్వాసానికి సేవా భావాన్ని జోడిస్తోంది. ఒక పూట భోజనాన్ని అందించడం వెనుక ఉన్న ఆలోచన భక్తులకు ఆత్మీయతను కలిగించడమే కాకుండా, సమాజంలో ఒకరికొకరు సహకరించుకోవాలనే స్ఫూర్తిని పెంపొందిస్తోంది. దీక్షలో ఉన్న వారికి ఆహారం.. సేవా మనసున్న వారికి సంతృప్తి అన్న రీతిలో డోలా దంపతుల కార్యక్రమం కొనసాగుతోంది.







గుండె ఆరోగ్యానికి 5 ఉత్తమ వంట నూనెలు

భారతీయ వంటకాలకు అనుకూలమైన 5 రకాల నూనెలను గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ అలోక్ చోప్రా సూచిస్తున్నారు. వీటిలో నెయ్యి, ఆవాల నూనె కూడా ఉన్నాయి. ఈ నూనెలు ఆరోగ్యానికి ఎన్నో రకాల ప్రయోజనాలను అందిస్తాయి. గుండె ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. అసంతృప్త కొవ్వులు ఎక్కువగా ఉండే నూనెను ఎంచుకోవడం గుండె ఆరోగ్యానికి చాలా అవసరం. అయితే, భారతీయ వంటకాల్లో నూనెను పూర్తిగా తీసివేయడం కష్టం. కాబట్టి, ఏ నూనె మన వంటకాలకు సరిపోతుందో తెలుసుకోవడం, అలాగే పాశ్చాత్య వంట శైలికి సరిపోయే ట్రెండ్‌లను అనుసరించకుండా ఉండటం అవసరం.




భారతీయ వంటకాలకు ఉత్తమ నూనెలు కార్డియాలజిస్ట్, ఫంక్షనల్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ అలోక్ చోప్రా ప్రకారం.. భారతీయ వంటకాలకు సరిపోయే ఐదు ఉత్తమ నూనెలు ఉన్నాయి. జూన్ 15న షేర్ చేసిన ఒక వీడియోలో ఆయన ఈ జాబితాను పంచుకున్నారు. ఇది కేవలం ట్రెండ్‌లను బట్టి కాకుండా సైన్స్ ఆధారంగా తయారు చేసిన జాబితా అని ఆయన నొక్కి చెప్పారు.

"భారతీయ వంటకాలకు ఉత్తమ నూనెలు.. సైన్స్ మద్దతుతో.. ట్రెండ్స్‌తో కాదు. మీ ఆహారానికి, మీ శరీరానికి ఏది పని చేస్తుందో తెలుసుకోండి" అని కార్డియాలజిస్ట్ రాశారు.

1. నెయ్యి:

నెయ్యిలో విటమిన్లు A, D, E, K పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణక్రియను, రోగనిరోధక శక్తిని పెంచుతుందని డాక్టర్ చోప్రా తెలిపారు.



2. కొబ్బరి నూనె:

కొబ్బరి నూనె మెదడు, పేగుల ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో మీడియం-చైన్ ట్రైగ్లిజరైడ్స్ కూడా పుష్కలంగా ఉంటాయని చెప్పారు. అంటే కొబ్బరి, పామ్ కెర్నెల్ నూనెల నుండి తయారయ్యే కొవ్వు అణువులు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ ప్రకారం MCTS శరీరంలో త్వరగా జీర్ణమై తక్షణ శక్తి వనరుగా ఉపయోగపడతాయి. ఇవి మంచి శారీరక, క్రియాత్మక లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి వివిధ ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయడంలో



సహాయపడతాయి.

3. ఆవాల నూనె:


డాక్టర్ చోప్రా ప్రకారం.. ఆవాల నూనె గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. శరీరంలో మంటను తగ్గిస్తుంది. ఇది మీ గుండెకు మంచి మిత్రుడిలా పనిచేస్తుంది. అంతేకాకుండా ఇందులో ఒమేగా-5 ఫ్యాటీ యాసిడ్స్ కూడా పుష్కలంగా ఉంటాయి.

4. నువ్వుల నూనె:

నువ్వుల నూనె కీళ్ళు, చర్మ ఆరోగ్యానికి సహాయకారిగా నిలుస్తుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇది భారతీయ వంటకాలకు గొప్ప ఎంపిక.

`5. వేరుశనగ నూనె:

వేరుశనగ నూనెలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్లాంట్ స్టెరాల్స్ పుష్కలంగా ఉంటాయని కార్డియాలజిస్ట్ వివరించారు. దీనిని మితంగా ఉపయోగించినప్పుడు గుండెకు మంచిదని ఆయన హెచ్చరించారు.



పిల్లల్లో మెదడు క్యాన్సర్: గుర్తించాల్సిన లక్షణాలు, చికిత్సా విధానాలు





మెదడు క్యాన్సర్ అంటే మెదడులో కణాలు అసాధారణంగా పెరిగిపోవడం. ఇది పెద్దవారిలో ఎక్కువగా కనిపించినా, పిల్లల్లో కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ క్యాన్సర్‌ను ఎంత త్వరగా గుర్తిస్తే, చికిత్సను అంత వేగంగా మొదలుపెట్టవచ్చు. దీనివల్ల పిల్లలు ఆరోగ్యంగా జీవించే అవకాశాలు చాలా మెరుగుపడతాయని విజయవాడ మణిపాల్ హాస్పిటల్స్ న్యూరో, స్పైన్ సర్జన్ డాక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. మెదడు క్యాన్సర్ లక్షణాలు, చికిత్స విధానాల గురించి ఆయన వివరించారు.

ప్రాథమిక లక్షణాలు

పిల్లల్లో మెదడు క్యాన్సర్ లక్షణాలు అచ్చం మామూలు జబ్బుల్లాగే అనిపించవచ్చు. అయితే, కొన్ని సంకేతాలను తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా గమనించాలి.

తరచుగా తలనొప్పి: ముఖ్యంగా ఉదయం పూట ఎక్కువగా ఉండటం లేదా నిద్రలోంచి లేపేంత తీవ్రంగా తలనొప్పి రావడం.

వాంతులు: ఇది కూడా ఉదయం పూట ఎక్కువగా, ఆహారంతో సంబంధం లేకుండా జరుగుతాయి.

కంటి చూపు సమస్యలు: కళ్ళు మసకబారడం, లేదంటే ఒకే వస్తువు రెండుగా కనిపించడం (డబుల్ విజన్).

నడవడంలో ఇబ్బంది: సరిగా బ్యాలెన్స్ చేసుకోలేకపోవడం, తరచుగా కింద పడిపోవడం.

ప్రవర్తనలో మార్పులు: పిల్లలు చిరాకుగా ఉండటం, ఎక్కువ నిద్రపోవడం, చదువులో వెనుకబడటం.

మూర్ఛలు (సీజర్స్): అకస్మాత్తుగా చేతులు, కాళ్లు కదలడం లేదా స్పృహ కోల్పోవడం.



తల పరిమాణం పెరగడం: చిన్న పిల్లలు, పసిపిల్లల్లో తల పెద్దగా మారడం ఒక హెచ్చరిక సంకేతం కావచ్చు.

ఈ లక్షణాల్లో ఒకటి కంటే ఎక్కువ కనిపిస్తే, పైగా అవి రోజురోజుకు పెరుగుతున్నట్లయితే, తల్లిదండ్రులు వెంటనే వైద్యుడిని సంప్రదించడం తప్పనిసరి.

చికిత్సా విధానాలు

పిల్లల్లో మెదడు క్యాన్సర్‌కు చికిత్స, ట్యూమర్ రకం, దాని పరిమాణం, అది ఎక్కడ ఉందనే దానిపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యమైన చికిత్సా పద్ధతులు ఇక్కడ ఉన్నాయి.

శస్త్రచికిత్స: వీలైనంత వరకు ట్యూమర్‌ను తొలగించడానికి ఆపరేషన్ చేస్తారు.

రేడియేషన్ థెరపీ: హై-ఎనర్జీ కిరణాలను ఉపయోగించి క్యాన్సర్ కణాలను నాశనం చేస్తారు. అయితే, పిల్లల మెదడు ఇంకా ఎదుగుదల దశలో ఉంటుంది కాబట్టి, ఈ చికిత్సను చాలా జాగ్రత్తగా, అవసరమైన మేరకు మాత్రమే ఉపయోగిస్తారు.

కీమోథెరపీ: క్యాన్సర్ కణాలను చంపడానికి మందులు ఇస్తారు. వీటిని నోటి ద్వారా గానీ, ఇంజెక్షన్ల రూపంలో నేరుగా నరాలలోకి గానీ ఇవ్వవచ్చు.


టార్గెటెడ్ థెరపీ: కొన్ని సందర్భాల్లో, క్యాన్సర్ కణాల్లో ఉండే కొన్ని ప్రత్యేక మార్పులను లక్ష్యంగా చేసుకుని పనిచేసే మందులను ఉపయోగిస్తారు.

చిన్నపిల్లల్లో మెదడు క్యాన్సర్‌ను సరైన సమయంలో గుర్తించి, సరైన చికిత్స అందించడం ద్వారా వారు తిరిగి ఆరోగ్యంగా, సంతోషంగా జీవించగలరు. అంతేకాకుండా, ఫిజికల్ థెరపీ, మానసిక మద్దతు వంటి సహాయక చికిత్సలు కూడా పిల్లలు త్వరగా కోలుకోవడానికి చాలా ముఖ్యమైనవి.

అనంత జనశక్తి
బుధవారం | రంగారెడ్డి
25.11.2026

మహారాష్ట్రలో విజయ్

'రణబాలి'తో విజయాన్ని అందుకున్న విజయ్ దేవరకొండ ప్రస్తుతం 'రౌడీ జనార్ధన' చిత్రాన్ని పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. వచ్చే ఏడాది వేసవి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రస్తుతం మహారాష్ట్రలో చిత్రీకరణ చేసుకొంటోంది. డిసెంబరు తొలి వారం వరకూ విజయ్ సహా ఇతర నటులపై కీలకమైన సన్నివేశాల్ని తెరకెక్కించనున్నట్లు సినీ వర్గాలు చెప్పాయి. విజయ్ దేవరకొండ, కీర్తి సురేశ్ జంటగా... రవికిరణ్ కోలా దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. 1980 దశకం నేపథ్యంలో సాగే కథతో రూపొందుతున్న ఈ చిత్రంలో విజయ్ పూర్తిస్థాయి మాస్ పాత్రని పోషిస్తున్నారు. ఆయన 'రణబాలి'లో రాయలసీమ యాస పలకగా, 'రౌడీ జనార్ధన'లో తూర్పు గోదావరి యాసతో మాట్లాడి అలరించనున్నారు.



'ది గర్ల్ ఫ్రెండ్' దర్శకుడితో!

కథానాయకుడు అడివి శేష్ ప్రస్తుతం 'జి2'ని ముగించే పనిలో ఉన్నారు. తన విజయవంతమైన సినిమా 'గూఢచారి'కి సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రథమార్ధంలో తెరపైకి వచ్చే అవకాశముంది. అయితే ఈలోగానే తన తదుపరి సినిమాని ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో ప్రేక్షకుల్ని మెప్పించిన రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో శేష్ ఓ చిత్రం చేసేందుకు పచ్చజెండా ఊపినట్లు సమాచారం. ఇప్పటికే దీనికి సంబంధించిన చర్చలు పూర్తయినట్లు తెలిసింది. ప్రస్తుతం కథానాయిక ఎంపికకు సంబంధించిన వేట కొనసాగుతోందని.. ఈ నెలాఖరులోనే నిర్మాణ సంస్థతో పాటు మరిన్ని వివరాల్ని అధికారికంగా ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది.



దొంగని పట్టుకోవడానికి సిద్ధమేనా?

'దొంగ మళ్లీ పారిపోతున్నాడు.. మీరు సిద్ధంగా ఉన్నారా?' అంటూ ఓటీటీ వేదికగా వీక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమయ్యారు బాలీవుడ్ కథానాయిక యామీ గౌతమ్. ఆమె.. సన్నీ కౌశల్ జంటగా రూపొంది, విమర్శకుల ప్రశంసలందుకున్న చిత్రం 'చోర్ నికల్ కే భాగా'. ఇప్పుడీ చిత్రానికి సీక్వెల్‌గా 'చోర్ నికల్ కే భాగా 2' రాబోతుంది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ఇన్‌స్టాలో ప్రకటించింది నెట్‌ఫ్లిక్స్. డిసెంబరు 17 నుంచి ప్రసారం కానుందని ఓ పోస్టర్‌ని పంచుకుంది. అజయ్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని దినేశ్ విజన్, అమర్ కౌశిక్ సంయుక్తంగా నిర్మించారు. శరద్ కేల్కర్ కీలకపాత్ర పోషించారు. చేసిన అప్పులు తీర్చేందుకు ఇద్దరు ప్రేమికులు విమానంలో అక్రమంగా తరలిస్తున్న వజ్రాలను దొంగిలించేందుకు ప్రయత్నిస్తారు. ఇంతలో ఆ విమానాన్ని హైజాక్ చేయడం, వీళ్ల ప్రణాళిక తారుమారవడం లాంటి థ్రిల్లింగ్ అంశాలతో మొదటి చిత్రం సాగుతుంది. ఇప్పుడు దానికి భిన్నమైన నేపథ్యంతో సీక్వెల్ రాబోతున్నట్లు చిత్రవర్గాలు తెలిపా



ఆడియన్స్‌కు 'రామాయణ' ఆఫర్

రణ్‌బీర్ కపూర్, యశ్, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'రామాయణ' టికెట్ ధరలను మేకర్స్ భారీగా తగ్గించారు. బాక్సాఫీస్ వద్ద వసూళ్లు తగ్గడంతో ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మంగళవారం నుంచి ఈ సినిమా టికెట్లు కేవలం రూ.99 నుంచే అందుబాటులోకి వచ్చాయని టీమ్ పేర్కొంది. కొన్ని థియేటర్లలో టికెట్ ధరలు ఏకంగా 80 శాతం వరకు తగ్గాయి. గతంలో రూ.300 నుంచి రూ.400 వరకు ఉన్న 2డీ టికెట్లు ఇప్పుడు రూ.99కే లభిస్తున్నాయి. 3డీ టికెట్ల ధరలు రూ.119 నుంచి రూ.249 వరకు ఉండగా, ఐమ్యాక్స్ షోలకు కూడా ధరలు తగ్గించారు. అయితే ప్రీమియం సీట్లు, కొన్ని ప్రత్యేక ఫార్మాట్ల టికెట్లు మాత్రం అధిక ధరల్లోనే కొనసాగుతున్నాయి. ఇక బాక్సాఫీస్ విషయానికి వస్తే.. విడుదలైన తొలి రోజుల్లో భారీ వసూళ్లు సాధించిన ఈ సినిమా, ఇటీవల కలెక్షన్ల జోరు తగ్గింది. నవంబర్ 23న కేవలం రూ.12.70 కోట్ల నెట్ వసూళ్లు మాత్రమే సాధించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.1,700 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సొంతం చేసుకున్న ఈ సినిమా భారత్‌లో ఇప్పటి వరకూ రూ.955 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి.



డ్రాతో సరి తొలి టెస్టులో తేలని ఫలితం

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ గడ్డపై పరుగులు వరద పారించి.. రికార్డు స్కోరుతో హోరెత్తించినా భారత్‌ను విజయం వెక్కిరించింది. బేసిన్ రిజర్వ్ పిచ్ పూర్తి నిర్జీవంగా మారడంతో బౌలర్ల శ్రమ వృథా అయింది. ఆఖరి రోజు ఆతిథ్య బ్యాటర్లు పక్కా టెస్టు జిడ్డు ఆటతో పోరాడగా.. విజయానికి అవసరమైన 8 వికెట్లను బౌలర్లు పడగొట్టలేకపోవడంతో తొలి టెస్టును భారత్ డ్రాతో సరిపెట్టుకుంది. సోమవారం ముగిసిన ఈ పోరులో న్యూజిలాండ్ బ్యాటర్లు డెవాన్ కాన్వే (165 బంతుల్లో 65), డారిల్ మిచెల్ (186 బంతుల్లో 49 నాటౌట్), రచిన్ రవీంద్ర (129 బంతుల్లో 37), గ్లెన్ ఫిలిప్స్ (126 బంతుల్లో 26 నాటౌట్) మొండి పట్టుదలతో క్రీజులో పాతుకుపోయి తమ జట్టుకు ఓటమి తప్పించారు. 119/2 ఓవర్‌నైట్ స్కోరుతో ఐదో రోజు ఆట ప్రారంభించిన కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో 239/5 వద్ద ఉన్నప్పుడు ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు. తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 720/9 వద్ద డిక్లేర్ చేసి 352 పరుగుల భారీ ఆధిక్యం సాధించినా, పిచ్ బౌలర్లకు ఏమాత్రం సహకరించకపోవడంతో విజయం దక్కలేదు. హెన్రీ నికోల్స్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ నెల 27న క్రైస్ట్‌చర్చ్ వేదికగా రెండో టెస్టు మొదలవనుంది.




భారత్‌దే హాకీ సిరీస్

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల హాకీ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకుంది. సోమవారం జరిగిన మూడో మ్యాచ్ 2-2తో డ్రాగా ముగిసింది. భారత్ తరఫున కెప్టెన్ సంజయ్ (16వ నిమిషంలో), కార్తీ సెల్వమ్ (18) రెండు నిమిషాల వ్యవధిలోనే రెండు గోల్స్ చేసినా న్యూజిలాండ్ నుంచి థామ (9), బెంజి కుల్వనె (55) చెరో గోల్‌తో తమ జట్టును డ్రాతో గట్టెక్కించారు.



శుభ్‌మన్.. అలా చేయడం కరెక్టు కాదు

న్యూజిలాండ్‌తో తొలి టెస్టు సందర్భంగా భారత్ పేసర్ అకాశ్‌దీప్ పై... కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వ్యవహరించిన తీరును మాజీ క్రికెటర్ అజింక్య రహానె తప్పబట్టాడు.. క్లిష్ట పరిస్థితుల్లో జట్టు సభ్యులకు మద్దతుగా ఉండాలే తప్ప.. విమర్శలకు తావివ్వకూడదని హితవు పలికాడు. అసలేం జరిగిందంటే.. న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో వాషింగ్టన్ సుందర్ వేసిన 71వ ఓవర్ తొలి బంతిని డారిల్ మిచెల్ మిడాన్ మీదుగా బాదాడు. సగం పిచ్ దాటేసిన అతడిని.. అవతలి ఎండ్‌లో ఉన్న బ్లండెల్ వెనక్కి పంపాడు. మిడాన్‌లో ఫీల్డింగ్ చేస్తున్న ఆకాశ్.. బంతిని సరైన సమయంలో అందుకొని స్టైకింగ్ ఎండ్ వైపు విసరలేకపోవడంతో రనౌట్ మిస్సయింది. దీంతో ఆకాశ్‌పై గిల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఆతర్వాత మిచెల్ ఏకంగా 49 పరుగులు బాదేశాడు. దీనిపై ఓ టీవీ ఛానల్‌లో రహానె మాట్లాడుతూ.. ఆకాశ్‌కు మద్దతుగా నిలిచాడు. ఆటలో ఇవన్నీ సహజమని.. అంతమాత్రన చిరాకు పడకూడదని గిల్‌కు హితవు పలికాడు. "బంతివైపు చూడకుండా.. తర్వాతి ఓవర్‌ను ఎలా వేయాలనే దానిపై ఆకాశ్ దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది. అందుకే సరిగా స్పందించలేకపోయాడు. ఇలాంటి సందర్భంలో సహచర ఆటగాళ్ల మద్దతు చాలా అవసరం" అని అన్నాడు.



ప్రియాంశ్ ఆర్య విధ్వంసం


సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ లో దిల్లీ కెప్టెన్ ప్రియాంశ్ ఆర్య మెరుపు ఇన్నింగ్స్‌లతో అలరిస్తున్నాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న అతడు ఇవాళ తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగి.. 68 బంతుల్లోనే 181 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో ఏకంగా 19 సిక్సర్లు ఉండటం విశేషం. సిక్స్‌లతోనే 114 పరుగులు రాబట్టిన ప్రియాంశ్.. ఏడు ఫోర్లు బాదాడు. 36 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకున్న ప్రియాంశ్.. 60 బంతుల్లో 150 పరుగుల మార్కు అందుకున్నాడు. దీంతో దిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 275/5 పరుగులు చేసింది. ఈ లక్ష్యఛేదనలో తమిళనాడు 18.3 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌటైంది. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌కు ఆడుతున్న ప్రియాంశ్.. ఈ భారీ ఇన్నింగ్స్‌తో పలు రికార్డులు నెలకొల్పాడు.

టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు (181) చేసిన భారత ఆటగాడిగా ప్రియాంశ్ నిలిచాడు. అంతకుముందు ఈ రికార్డు కేఎల్ రాహుల్ పేరిట ఉండేది. 2026 ఐపీఎల్‌లో రాహుల్ పంజాబ్ కింగ్స్‌పై 152 రన్స్‌తో అజేయంగా నిలిచాడు.

ప్రియాంశ్ మరో ఏడు పరుగులు చేస్తే టీ20ల్లో అత్యధిక స్కోరు చేసిన బ్యాటర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పేవాడు. గత నెలలో CSA ప్రో20 కప్‌లో టైటాన్స్ తరఫున నైట్స్‌పై 188* పరుగులు చేసిన లూవాన్ డ్రే ప్రిటోరియస్ ఈ జాబితాలో అగ్రస్థానంలో, క్రిస్ గేల్ (175*) మూడో స్థానంలో ఉన్నారు.

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో ప్రియాంశ్‌దే అత్యధిక వ్యక్తిగత స్కోరు. టీ20ల్లో అత్యధిక స్కోరు చేసిన భారత కెప్టెన్‌గానూ రికార్డు సృష్టించాడు.

ఒక టీ20 ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు (19) కొట్టిన బ్యాటర్‌గా ఫిన్ అలెన్ రికార్డును ప్రియాంశ్ సమం చేశాడు. మేజర్ లీగ్ క్రికెట్‌లో ఫిన్ అలెన్ శాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ తరఫున ఆడుతూ వాషింగ్టన్ ఫ్రీడమ్‌తో జరిగిన మ్యాచ్‌లో 19 సిక్స్‌లు బాదాడు.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945